

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం


22.06.2026
సోమవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 42
పేజీలు : 12 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


### ఏడుగురు మృతి

## 60 మందికి అస్వస్థత

- రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌లో గ్యాస్ లీక్
- తమిళనాడులో ఘటన




చెన్నై, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్

తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంటులో అమ్మోనియా గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు చనిపోయారు. పదుల సంఖ్యలో అస్వస్థతకు గురయ్యారు. పెరియపాళ్యం సమీపంలోని కన్నిగైపైర్‌లో ఉన్న సెయింట్ పీటర్స్ అండ్ పాల్స్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ ఫెసిలిటీలో ఆదివారం మధ్యాహ్న సమయంలో అమ్మోనియా గ్యాస్ లీకైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు చనిపోగా.. సుమారుగా 60 మంది కార్మికులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

2లో..

## ఘనంగా యోగా డే వేడుకలు

- యోగా.. ఐక్యతకు మూలం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- కోల్‌కతాలో యోగా చేసిన ప్రధాని



హైదరాబాద్, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్

యోగా .. ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు. కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు.

2లో..

### బీజేపీ కుట్రలు ప్రజలకు

## తెలియాలనే ఈ పోరాటం

- తిరస్కరణలో కాంగ్రెస్ నేతల పాత్ర లేదు
- కావాలనే బీజేపీ అబద్ధాలు సృష్టించింది
- మీనాక్షి నటరాజన్ వెల్లడి



2లో..

### బెంగాల్‌లో

## ఘోర రోడ్డు ప్రమాదం

- ఐదుగురి మృతి, 17 మందికి గాయాలు

కోల్‌కతా, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్

పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

2లో..

# గ్రామ గ్రామాన యోగా మందిరాలు



- ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం
- టెక్నాలజీకి ఆధ్యాత్మికను అనుసంధానిస్తే అన్‌స్టాపబుల్
- ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని అమలు
- భారత శక్తిని ప్రపంచానికి చాటుతున్న ప్రధాని సేవలు శ్లాఘనీయం
- తిరుపతిలో యోగాంధ్ర-2027
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

9లో..




అమరావతి, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్

ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో యోగా మందిరాలను నిర్మిస్తామని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆదివారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సీఎం చంద్రబాబు యోగాంధ్ర లోగో ఉన్న చొక్కా ధరించి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో ప్రముఖ యోగా గురు రామ్ దేవ్ బాబా వివిధ ఆసనాలు వేయించారు. ప్రాణాయామం, అనులోమ, విలోమ పద్ధతుల్లో సీఎం చంద్రబాబు యోగాభ్యాసం చేశారు. అలాగే యోగాభ్యాసంలో భాగంగా వివిధ ఆసనాలను సీఎం చంద్రబాబు సునాయాసంగా వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐజీఎం స్టేడియం విద్యార్థి, యువతీ, యువకులతో నిండిపోయింది.

## ఐజీ రవిప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక సిట్

- సీఐ నాగరాజు అరెస్ట్‌కు రంగం సిద్ధం
- సాయి కృష్ణ కేసు వ్యవహారం
- 23 ఏళ్ల యువకుడు సాయి కృష్ణ మిస్సింగ్

2లో..

## ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి

- రాబోయేది మన ప్రభుత్వమే..
- హనుమాన్ నగర్ బస్తీవాసులకు కేటీఆర్ భరోసా



హైదరాబాద్, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్

అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను "గుంపు మేస్త్రి" అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.

8లో..

## పీహెచ్‌డీ కావాలి

- గుంటూరు జిల్లాలో రాజకీయం చేయాలంటే..
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- 30 ఏండ్లు కూటమి ప్రభుత్వం ఉండేలా..
- ప్రజలు ఆశీర్వదించాలని వినతి

10లో..



గుంటూరు, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్

గుంటూరు జిల్లాలో రాజకీయం చేయాలంటే పీహెచ్‌డీ కావాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజకీయం పుట్టింది గుంటూరులో అంటారని, మరొక 30 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేలా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

### క్రియా, అష్టాంగ యోగాలు నా జీవితంలో భాగం



2లో..

## రాజ్యాంగ పదవికి అర్హుడా?

- కూటమి ప్రభుత్వంపై బొత్స విమర్శలు
- సాయి కృష్ణ కేసుకు సీబీఐ విచారణ డిమాండ్
- పవన్ కళ్యాణ్‌పై ఘాటు వ్యాఖ్యలు
- కాపు కార్పొరేషన్ నిధులపై తీర్మానాలు

2లో..



### రైతులపై చంద్రబాబు

## ప్రేమ బూటకం

- ప్రతి విషయంలోనూ మోసమే
- హామీలు అమలు కాలేదన్న జగన్
- 7 లక్షల మంది రైతులను పథకం నుంచి తొలగించారు
- పంటల బీమా, ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యం

10లో..



హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్

చంద్రబాబుకు రైతులపై ఉన్న ప్రేమ కేవలం బూటకమని, ఆయన పాలనలో రైతులకు మోసం, నిరాశ మాత్రమే మిగిలాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా 143 హామీలలో అమలు కాలేదని ఆయన ఎక్స్ విమర్శలు గుప్పించారు.

## ప్రపంచానికి యోగా ఓ వరం

### హోం మంత్రి అనిత వెల్లడి

అమరావతి, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్

ప్రపంచానికి యోగా ఒక వరం లాంటిదని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి అనిత అభివర్ణించారు. ఆదివారం యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీవనశైలిలో యోగా ఒక భాగం కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకున్నామని వివరించారు.

10లో..



# ఘనంగా యోగా డే వేడుకలు

**న్యూఢిల్లీ, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

యోగా .. ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు. కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు.

''జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవాళ యోగా కార్యక్రమాలతో దేశం మొత్తం చైతన్యంతో నిండిపోయింది. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. కేవలం కొన్ని వయసుల వారికే పరిమితం కాలేదు. ఇది మానవ స్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరిని చేరువ చేస్తుంది. అందర్నీ ఏకం చేస్తుంది. జీవనం మరింత సమతులంగా సాగేలా చేస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో నేర్పుతుంది. శక్తిమంతంగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది. 20ఏళ్ల కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలి. ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. అందుకే యోగాను కొన్ని సందర్భాలకే పరిమితం చేయకుండా.. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మరింత మెరుగైన ప్రపంచం కోసం యోగా అవసరం'' అని మోదీ అన్నారు.

# ఏడుగురు మృతి 60 మందికి అస్వస్థత

**చెన్నై, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంటులో అమ్మోనియా గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు చనిపోయారు. పదుల సంఖ్యలో అస్వస్థతకు గురయ్యారు. పెరియపాళ్యం సమీపంలోని కన్నిగైపైర్‌లో ఉన్న సెయింట్ పీటర్స్ అండ్ పాల్స్ సీఫుడ్స్ ఎక్స్‌పోర్ట్స్ ఫెసిలిటీలో ఆదివారం మధ్యాహ్న సమయంలో అమ్మోనియా గ్యాస్ లీకైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు చనిపోగా.. సుమారుగా 60 మంది కార్మికులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.

బాధితుల్లో ఎక్కువమంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారిగా తెలిసింది. అమ్మోనియా గ్యాస్ పీల్చటంతో శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు, వాంతులు, తల తిరగడంతో వంటి లక్షణాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరందరినీ అంబులెన్సులలో సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్య చికిత్సల కోసం కొంతమందిని చెన్నైకు



తరలిస్తున్నట్లు తెలిసింది. రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో అమర్చిన వాల్వ్ నుంచి అమ్మోనియా గ్యాస్ లీక్ అయినట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బలగాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఫుడ్ యూనిట్లలోని కోల్డ్ స్టోరేజ్ వేర్ హౌస్‌లలో చల్లదనం కోసం అమ్మోనియా గ్యాస్ ఉపయోగిస్తుంటారు.

అమ్మోనియా గ్యాస్ లీక్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే.. తిరువళ్లూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కుమార్, కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అటు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించిన విజయ్.. అమ్మోనియా గ్యాస్ లీక్ కావడానికి కారణాలను కనిపెట్టేందుకు ముగ్గురు సభ్యులతో దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేశారు. కారణమైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రమాదంపై 24 గంటల్లోగా ప్రాథమిక నివేదిక, మూడు రోజుల్లోగా తుది నివేదిక అందించాలని ఆదేశించారు. సీఎం విజయ్ ఆదేశాలతో ప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. మరోవైపు ప్లాంట్ యజమానితో పాటుగా మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

# బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



**కోల్‌కతా, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

పశ్చిమ బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం నార్త్ బెంగాల్ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెందిన బస్సు మైనాగురి నుంచి డోమోహానికి బయలు దేరింది. ఉల్లదబారి ఏరియాలో బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్‌ను ఢీకొట్టింది.

దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని జల్పాయ్‌గురి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఐదు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 23 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 17 మందిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్న దాని ప్రకారం.. గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఆ రోడ్డు మొత్తం బురదతో నిండిపోయింది. బురద కారణంగా వాహనాలు జారుతున్నాయి. బురద కారణంగా బస్సు అదుపుతప్పింది. బస్సు డ్రైవర్ కంట్రోల్ కోల్పోయాడు. రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రక్కును ఢీకొట్టాడు.

# బీజేపీ కుట్రలు ప్రజలకు తెలియాలనే ఈ పోరాటం

**న్యూఢిల్లీ, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని అధికార బీజేపీ, ఎన్నికల సంఘం లాలూచీ పడి కుట్రపూరితంగానే తన నామినేషన్‌ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తనపై వస్తున్న ఆరోపణలను మీనాక్షి పూర్తిగా ఖండించారు. తన రాజ్యసభ సీటును అక్రమంగా చోరీ చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నాకోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేనని, మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటానని ఆమె అన్నారు.

**నాపై ఎలాంటి లీగల్ కేసులు లేవు**

నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం ఇచ్చానంటూ వస్తున్న వార్తలపై మీనాక్షి నటరాజన్



స్పష్టతనిచ్చారు. 'నాపై ఎలాంటి లీగల్ కేసులు లేవు. అసలు నామినేషన్ పత్రంలో 'లీగల్ నోటీస్'కు సంబంధించిన ప్రత్యేక కాలమ్ ఎక్కడా లేదు. లేని కాలమ్‌ను సాకుగా చూపి, సాంకేతిక కారణాల పేరుతో నా నామినేషన్‌ను తిరస్కరించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం' అని ఆమె మండిపడ్డారు. కావాలనే బీజేపీ తనపై అబద్ధాలు సృష్టిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు.

**కాంగ్రెస్ నేతల పాత్ర లేదు.. అంతా బీజేపీ కుట్రే!**

ఈ నామినేషన్ తిరస్కరణ వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందంటూ వస్తున్న పుకార్లను ఆమె తోసిపుచ్చారు. 'నా నామినేషన్ తిరస్కరణలో కాంగ్రెస్ నేతల పాత్ర ఏమాత్రం లేదు. మా పార్టీ అంతా ఏకతాటిపైనే ఉంది. ఇదంతా పూర్తిగా బీజేపీ ఆడిన నాటకం. ప్రజాస్వామ్య వ్యవస్థలను వాడుకుని బీజేపీ చేస్తున్న కుట్రలను, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లడమే నా ప్రస్తుత పోరాటం' అని మీనాక్షి స్పష్టం చేశారు.

**ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటాం**

కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి లొంగి ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించిందని, విపక్ష నాయకులను టార్గెట్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆమె ఆరోపించారు. చట్టబద్ధంగా దక్కాల్సిన రాజ్యసభ స్థానాన్ని కుతంత్రాలతో లాక్కున్నారని, ఈ అన్యాయంపై వెనక్కి తగ్గేదే లేదని, ప్రజల మద్దతుతో బీజేపీ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తానని మీనాక్షి నటరాజన్ తేల్చిచెప్పారు.

# క్రియా, అష్టాంగ యోగాలు నా జీవితంలో భాగం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- యోగా దేశ నాగరికతా జీవన విధానం
- ప్రపంచానికి దేశం ఇచ్చిన అమూల్యమైన కానుక

**అమరావతి, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. యోగా అనేది భారతదేశ నాగరికతా జీవన విధానంలో ఒక అంతర్భాగమని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి భారతదేశం అందించిన ఒక అమూల్యమైన కానుక యోగా అని అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పోస్టు పెట్టారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యత, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

చిన్న వయసులోనే యోగా ప్రయాణాన్ని ప్రారంభించా..

ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవన విధానంగా స్వీకరించి, దానిని తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తాను చిన్న వయసులోనే యోగా ప్రయాణాన్ని ప్రారంభించానని ప్రస్తావించారు. తన మనస్సు అనేక ప్రశ్నలతో నిండి ఉన్న సమయంలో, యోగా తనకు కేవలం సమాధానాలనే కాకుండా, తన ప్రయాణాన్ని సమగ్రంగా ప్రభావితం చేసిన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను కూడా అందించిందని తెలిపారు. క్రియా, అష్టాంగ యోగాలు, 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వారి సుదర్శన క్రియ వంటి అభ్యాసాలు ఇప్పటికీ తన దైనందిన జీవితంలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయని వివరించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశేషంగా కృషి చేశారని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకునేలా ప్రధాని మోదీ దూరదృష్టితో కూడిన చొరవ చూపించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



# ఐజీ రవిప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక సిట్

- పోలీసులే లాకప్ డెత్ చేశారు: కుటుంబం

**అమరావతి, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

సాయి కృష్ణ మిస్సింగ్ కేసులో దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చీఫ్‌గా ఐజీ రవి ప్రకాష్‌ను నియమించింది. ఆయనతో పాటు పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీం సమీ, అల్లూరు సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బార్దర్, బాపట్ల అడిషనల్ ఎస్పీ ఎల్ సుధాకర్‌లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించింది. మరోవైపు, సాయికృష్ణ మిస్టరీ వ్యవహారంలో సీఐ నాగరాజుపై హత్య, నిర్బంధం సెక్షన్ల కింద కేసు నమోదుకాగా.. ఆయన అరెస్టుకు రంగం సిద్ధమవుతోంది. నేడో రేపో ఆయనను అదుపులోకి తీసుకుని.. కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయన నివాసం వద్ద నిఘా కోసం సిబ్బందిని



మోహరించారు. రెండు రోజులుగా దర్యాప్తు బృందాలు టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక సిబ్బందిని విచారిస్తున్నారు. వీరి నుంచి కీలక వివరాలు రాబడుతున్నట్లు తెలిసింది. ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని బృందం శనివారం కూడా కృష్ణలంక స్టేషన్‌లో సిబ్బందిని విచారించి, స్టేట్‌మెంట్లు నమోదు చేశారు. ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా కేంద్ర హోంశాఖ రూపొందించిన 'ఈసాక్ష్య' టూల్ ద్వారా వారి వాంగ్మూలాలను వీడియో రికార్డు చేస్తున్నారు. మార్కాపురం నుంచి సాయికృష్ణను తీసుకొచ్చిన ముగ్గురు టాస్క్‌ఫోర్స్, ఓ కృష్ణలంక కానిస్టేబుల్‌తో కూడిన బృందాన్ని మరోసారి పిలిపించి విచారించారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారిని కూడా రెండోరోజూ విచారించి దాదాపు 12 మంది నుంచి వివరాలు సేకరించి వాంగ్మూలాలను రికార్డు చేశారు. బస్టాండు ప్లాట్‌ఫారాలపై అనాథ శవాల గురించి ఆరా తీసి, సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించారు.

సాయికృష్ణ మృతదేహాన్ని కృష్ణలంక స్వర్గపురిలో దహనం చేశారని అతడి తల్లి ఆరోపించడంతో అక్కడా కూడా విచారణ చేపట్టారు. పటమట సీఐ పావన్ కిశోర్ శనివారం ఉదయం స్వర్గపురికి వెళ్లి, మే 23 నుంచి 26 మధ్య దహనం చేసిన మృతదేహాల వివరాలను పరిశీలించారు. ఆపరేటర్ బాషా, కాటికాపరి శివ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో మే 23న రాత్రి 8 గంటల ప్రాంతంలో 45, 50 ఏళ్ల వయసున్న అనాథ శవాలను స్వర్గపురికి పోలీసులు తెచ్చినట్లు సిబ్బంది తెలిపారు. వీటిలో ఒకటి బస్టాండు దగ్గర, మరొకటి కాళికామాత ఆలయం ఎదుట గుర్తించారు. వాటిని స్వర్గపురిలో ఉంచేందుకు తొలుత నిరాకరించిన సిబ్బంది, డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెప్పడంతో ఫ్రీజర్‌లో భద్రపరిచి మర్నాడు మధ్యాహ్నం దహనం చేసినట్లు చెప్పారు.

అటు, ప్రభుత్వ ఆదేశాలతో కృష్ణ జిల్లా కమిషనరేట్ పరిధిలోని గుణదల, జగ్గయ్యపేట, మైలవరం, వన్ టౌన్, పటమట, సత్యనారాయణపురం సీఐలతో కీలక ఆధారాల కోసం విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దర్యాప్తు చేస్తున్నారు.

# రాజ్యాంగ పదవికి అర్హుడా?

**కాకినాడ, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

కాకినాడ జిల్లా వెంకటాపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కాపు సామాజికవర్గ నేతల ఆత్మీయ సమావేశం శనివారం ముగిసింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సామాజిక వర్గ కార్యక్రమాలు , కాపులపై జరుగుతున్న దాడుల గురించి నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ఎవరినో అధికారంలో కూర్చోబెట్టడానికి మేము లేము: బొత్స**

సమావేశం అనంతరం మీడియాలో మాట్లాడిన బొత్స సత్యనారాయణ, తాము ఎవరినో తీసుకెళ్లి అధికారంలో కూర్చోబెట్టడానికి ఈ సమావేశాలు పెట్టుకోవడం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాపు కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ. 3 వేల కోట్లు ఇస్తామని హామీ ఇచ్చిందని, మరి గడిచిన కాలంలో కాపులకు ఏం న్యాయం జరిగిందని ఆయన ప్రశ్నించారు. వైసీపీ హయాంలో తాము 'కాపు నేస్తం' ద్వారా లబ్ధి చేకూర్చామని గుర్తు చేస్తూ.. ఉన్న పథకాలను తీసేస్తామంటే కుదిరేది లేదని హెచ్చరించారు. అధికారం ఉందని రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకునేది లేదని, త్వరలోనే విశాఖపట్నం, తిరుపతితో పాటు మరికొన్ని



ప్రాంతాలలో కాపు సామాజికవర్గ సమావేశాలు భారీగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**సాయి కృష్ణ లాకప్ డెత్, క్రాంతి కుమార్ ఆత్మహత్యలపై నిలదీత**

సాయి కృష్ణ లాకప్ డెత్ వ్యవహారంపై బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. చనిపోయిన సాయి కృష్ణ తమ కులం వాడేనని, అతనికి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. క్రిమినల్ అయితే చంపేస్తారా అని ప్రశ్నిస్తూ, అసలు సాయి కృష్ణ శవం కూడా లేకుండా చేశారని, ఈ ఘటనలో కేవలం పోలీసులను సస్పెండ్ చేస్తే సరిపోతుందా అని నిలదీశారు. ఈ కేసు దర్యాప్తు కోసం సిట్ ఎందుకు వేశారని, సిట్ వల్ల బాధితులకు న్యాయం జరుగుతుందా అని అనుమానం వ్యక్తం చేస్తూ దీనిపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే వైసీపీలో ఉన్న కాపు నేతలందరూ ఒక్కొక్కరు రూ. 50 వేల చొప్పున సేకరించి సాయి కృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తామని బొత్స ప్రకటించారు.

పవన్ కళ్యాణ్ అర్హుడా?

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటనను, ఆయన చేసిన వ్యాఖ్యలను బొత్స తీవ్రంగా తప్పుపట్టారు. అసలు పవన్ కళ్యాణ్ కాకినాడకు ఎందుకు వచ్చారని, తామేమైనా రౌడీలమా అని ప్రశ్నిస్తూ ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎవరి తాట ఎవడు తీస్తాడు అంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ముమ్మాటికీ తప్పని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్న పవన్ కళ్యాణ్ అసలు రాజ్యాంగ పదవిలో ఉండటానికి అర్హుడేనా అని ప్రశ్నిస్తూ, గతంలో దెందులూరులో ఏం జరిగిందో అందరికీ తెలుసని గుర్తు చేశారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య తీర్మానాలు

ఈ ఆత్మీయ సమావేశంలో వైసీపీ కాపు నేతలు ఏకగ్రీవంగా పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. కాపు కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు ఇవ్వాలని, గతంలో బాకీ పడ్డ రూ. 9 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాయి కృష్ణ లాకప్ డెత్, క్రాంతి కుమార్ ఆత్మహత్యలపై తీవ్ర ఖండన వ్యక్తం చేస్తూ వీటిపై సీబీఐ విచారణ జరిపించాలన్నారు. అలాగే కాపులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడైనా కాపులను ఇబ్బంది పెడితే వారికి అండగా నిలబడటానికి , సపోర్ట్ చేయడానికి పార్టీ తరపున మూడు ప్రత్యేక 'టాస్క్‌ఫోర్స్' బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ దుర్మార్గాలను, కాపులపై జరుగుతున్న కుల వివక్షను తాము గట్టిగా ఎదుర్కొంటామని, ఎక్కడ ఏ సంఘటన జరిగిన దోపిడీకి గురవుతున్న తమ సామాజిక వర్గానికి వైసీపీ నేతలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

# ఒకే రోజు మూడు యుద్ధనౌకలు..
# భారత సముద్రశక్తికి చిహ్నం..!



భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు.

ఐఎన్ఎస్ దుణగిరి

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది.

ఐఎన్ఎస్ సంశోధక్

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై నివేదికల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, లోతైన సముద్ర మార్గాలు, మారిటైం పరిధిలో సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాఫ్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు.

ఐఎన్ఎస్ అగ్రయ్

కోల్‌కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్‌మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్‌గా నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక స్వీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్, వాటర్ జెట్లతో డీజిల్ యంత్రాలను అనుసంధానం చేయడం దీని ప్రత్యేకత.



## యోగా.. ఐక్యతకు మూలం: మోదీ

కోల్‌కతా: .. ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు. కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు.

''జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవాళ యోగా కార్యక్రమాలతో దేశం మొత్తం చైతన్యంతో నిండిపోయింది. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. కేవలం కొన్ని వయసుల వారికే పరిమితం కాలేదు. ఇది మానవ స్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరిని చేరువ చేస్తుంది. అందర్నీ ఏకం చేస్తుంది. జీవనం మరింత సమతులంగా సాగేలా చేస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో నేర్పుతుంది. శక్తిమంతంగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది.

20ఏళ్ల కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలి. ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. అందుకే యోగాను కొన్ని సందర్భాలకే పరిమితం చేయకుండా.. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మరింత మెరుగైన ప్రపంచం కోసం యోగా అవసరం'' అని మోదీ అన్నారు.

# ధైర్యంగా పరీక్షకు వెళ్లండి:
# నీట్ విద్యార్థులకు ధర్మేంద్ర ప్రధాన్ సూచన




నేడు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నీట్ యూజీ పునఃపరీక్ష కు దాదాపు 22లక్షల మంది అభ్యర్థులు హాజరవ్వనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆందోళన లేకుండా, ధైర్యంగా పరీక్షకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు అందరూ తప్పకుండా మంచి మార్కులు సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు.

మరికొన్ని గంటల్లో పిల్లలు పరీక్ష రాయబోతున్నారని.. పరీక్ష సమయంలో తప్పుడు వార్తలు ప్రచారం చేసి విద్యార్థులను ఆందోళనకు గురి చేయవద్దని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు. పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే పనులు చేయవద్దన్నారు. అదే సమయంలో పెండింగ్‌లో ఉన్న సీబీఎస్‌ఈ ఫలితాలను త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

ప్రశాంతంగా ఉండండి..మీకు మేమున్నాం: ఎన్‌టీఏ

పరీక్ష నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విద్యార్థులకు పలు సూచనలు చేసింది. ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని.. ప్రశాంతంగా ఎగ్జామ్ రాయాలని పేర్కొంది. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు, గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను వెంట తీసుకు రావాలని సూచించింది. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశం ఉదయం 11:00 గంటలకు ప్రారంభమవుతుందని.. మధ్యాహ్నం 1:30 వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతిస్తారని తెలిపింది. ఈ సమయం దాటితే ఏ అభ్యర్థినీ లోపలికి అనుమతించబోరని పేర్కొంది.

ఈ ఏడాది ఆరంభంలో జరిగిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలతో సహా పలు వివాదాలు తలెత్తిన నేపథ్యంలో.. కట్టుదిట్టమైన భద్రతల నడుమ నేడు నీట్ రీటెస్ట్ నిర్వహిస్తున్నారు. పరీక్షల సమర్థ నిర్వహణకు మొత్తం 2 లక్షల మందికి పైగా సిబ్బంది సేవలను వినియోగిస్తున్నారు. ఎలాంటి లోపాలూ తలెత్తకుండా సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచారు. పరీక్ష కేంద్రాల వద్ద రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 'వీఐటీ' పురోగతి



ప్రతిష్ఠాత్మకమైన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్2027లో తమిళనాడులోని వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) డీమ్డ్ యూనివర్సిటీ గతంతో పోలిస్తే పురోగతి సాధించింది. లండన్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఉన్నత విద్యా విశ్లేషణ సంస్థ అయిన క్యూఎస్.. ప్రపంచవ్యాప్తంగా 1,500కు పైగా విద్యాసంస్థలను విశ్లేషించి ఏటా ర్యాంకులు ఇస్తుంది. ఈ ఏడాది వేలూర్‌లోని వీఐటీ డీమ్డ్ విశ్వవిద్యాలయానికి 597వ ర్యాంకు దక్కింది. గతేడాది 691వ ర్యాంకు దక్కగా ఈ ఏడాది 94 స్థానాలు పైకి ఎగబాకింది. దీనిపై వీఐటీ ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో వీఐటీ గణనీయంగా మెరుగుపడటం గర్వకారణమన్నారు. టాప్200 జాబితాలోకి ప్రవేశించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

# మాజీ సీఎం పినరయి
# విజయన్ కూతురుకు ఈడీ సమన్లు





కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. ఆయన కూతురు టీ వీణాకు మనీ లాండరింగ్ కేసులో సమన్లు జారీ చేసింది. సీఎంఆర్ఎల్ అనే మైనింగ్ కంపెనీతోపాటు ఆమె ఐటీ కంపెనీకి సంబంధించి మనీ లాండరింగ్ జరిగిందనే ఆరోపణలపై ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 29న వీణా తమ ఎదుగ వ్యక్తిగతంగా హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. వీణాకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ నోటీసులు ఇవ్వడం ఇది రెండోసారి. గతంలోనే ఒకసారి నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది.

ఈ నెల 17న ఆమెను కోచిలోని ఈడీ ఆఫీసులో అధికారులు విచారించారు. దాదాపు తొమ్మిది గంటలకుపైగా ఆమెను విచారించారు. ఆమెపై పీఎంఎల్ఏ యాక్ట్ కింద నమోదైన కేసుపై ఈ విచారణ సాగుతోంది. జూన్ 19న ఈడీ అధికారులు తిరువనంతపురంలోని ఆమె బ్యాంకు లాకర్లను కూడా తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం జరిగిన విచారణలో ఆమె ఇచ్చిన వాంగ్మూలం, బ్యాంకు లాకర్ల తనిఖీల తర్వాత మరింత విచారణ అవసరమని ఈడీ అధికారులు భావించారు. అందుకే ఆమెకు మరోసారి సమన్లు జారీ చేశారు. ఈ నెల 29న మరోసారి తమ ఎదుట హాజరు కావాలని వీణకు సూచించారు. ఈ కేసులో మరో నలుగురికి కూడా అధికారులు ఇప్పటివరకు విచారించారు.

సీఎంఆర్ఎల్ సంస్థ నుంచి వీణకు చెందిన ఐటీ సంస్థకు రూ.2.87 కోట్లు బదిలీ అయ్యాయని ఈడీ గుర్తించింది. ఏ సేవలు అందించకుండానే వీణ సంస్థకు చెల్లింపులు జరిగాయి. అలాగే, ఇతర లోన్లకు సంబంధించి కూడా అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపిస్తోంది. దీంతో వీటిని ఈడీ విచారిస్తోంది. మరోవైపు పినరయి కూతురును ఈడీ విచారించడంపై కేరళలో ప్రతిపక్ష ఎల్డీఎఫ్ కూటమి కేంద్రంపై విమర్శలు చేస్తోంది. రాజకీయంగా వేధించేందుకే ఈ విచారణ అని విమర్శిస్తున్నారు.

## మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు మీకు లేదు



భారత దేశం లోని ముస్లిం ప్రార్థనా స్థలాలకు ముప్పు పొంచి ఉందంటూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు జర్దారీకి లేదని స్పష్టంచేసింది. ఆయన వ్యాఖ్యలు అసంబద్ధమైనవని, అనవసరమైనవని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కొట్టిపారేశారు.

వారణాసిలోని కాశీ రైల్వే స్టేషన్ సమీపంలోగల గంజ్ షహీదా మసీదుకు భారత రైల్వే శాఖ జారీచేసిన నోటీసులను ఉద్దేశించి జర్దారీ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై గురువారం రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. పాక్ అధ్యక్షుడి ప్రకటనను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోందని, భారత అంతర్గత విషయాలపై మాట్లాడే అర్హత ఆయనకు ఏమాత్రం లేదని తేల్చిచెప్పారు. పాకిస్థాన్‌లో మైనారిటీల హక్కుల ఉల్లంఘన, అక్కడి మానవ హక్కుల దయనీయ స్థితిపై అంతర్జాతీయంగా వస్తున్న విమర్శలను జైస్వాల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.


ఇతరులకు హితవు పలికే ముందు పాక్ తన దేశంలోని పరిస్థితులను చక్కదిద్దుకోవాలని సూచించారు. ద్వేషం, మతతత్వాన్ని ప్రోత్సహించడమే పాకిస్థాన్ జాతీయ విధానంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. భారత్ తన అంతర్గత విధానాలకు సంబంధించిన అంశాల్లో, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ వంటి విషయాల్లో విదేశాల జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని చాలాకాలంగా హెచ్చరిస్తోంది.

## ప్రముఖ కవి నారాయణ కురుప్ కన్నుమూత

ప్రముఖ మలయాళ కవి, సాహితీ విమర్శకులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత, 92 ఏళ్ల పీ నారాయణ కురుప్ కన్నుమూశారు. తిరువనంతపురం లోని పెరూర్కడలో తన నివాసంలో ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల మలయాళ సాహితీ లోకం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. 1934 సెప్టెంబర్ 5న అప్పటి ట్రావెన్‌కోర్ సంస్థానంలోని హరిపాడులో జన్మించిన నారాయణ కురుప్, కవిగా, విమర్శకుడిగా మలయాళ సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

నాలుగు దశాబ్దాలకుపైగా సాహితీ సేవ చేసిన ఆయన సంప్రదాయ, ఆధునిక సాహిత్య ప్రక్రియలపై చెరగని ముద్రవేశారు. కేవలం రచయితగానే కాకుండా కథాకళి, కూడియాట్టం వంటి శాస్త్రీయ కళల విమర్శకుడిగా, ప్రోత్సాహకుడిగా ఆయన విశేష ఖ్యాతి గడించారు. తపస్య, మార్గి వంటి పలు ప్రతిష్ఠాత్మక కళా, సాహిత్య సంస్థలకు అధ్యక్షుడిగా కూడా ఆయన సేవలందించారు. ఆయన సాహిత్య కృషికి గుర్తింపుగా అనేక ఉన్నత పురస్కారాలు లభించాయి. 1991లో కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, 2014లో వల్లథోల్ అవార్డు వంటి గౌరవాలు ఆయనను వరించాయి.

భారత ప్రభుత్వం 2022లో ఆయనను దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మశ్రీ' తో సత్కరించింది. కురుప్ మరణవార్త తెలియగానే సాహిత్య, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. తిరువనంతపురంలోని థైకాడ్ శాంతికవాడం శ్మశానవాటికలో కుటుంబసభ్యుల సమక్షంలో ఆయన అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు.



## ప్రధాని మోదీపై మరోసారి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ప్రశంసలు

కాంగ్రెస్ పార్టీ కి చెందిన సీనియర్ ఎంపీ శశిథరూర్ మరోమారు తన సొంత పార్టీలోనే తీవ్ర వివాదానికి కేంద్రబిందువుగా మారారు. జీ7 సదస్సు వేదికగా పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ భారతీయ వాణిజ్య నౌకల నావికుల భద్రత గురించి ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలను శశిథరూర్ ప్రశంసించడం ఇందుకు కారణమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన బహిరంగ, వ్యక్తిగత సమావేశాల్లో పౌర నావికులను సైనిక దాడుల లక్ష్యాలుగా చేసుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని మోదీ బలంగా వినిపించారని థరూర్ కొనియాడారు.

అయితే ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా స్పందిస్తూ.. శశి థరూర్‌పై సోషల్ మీడియాలో సెటైర్లు వేశారు. పవన్ ఖేరా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విదేశాంగ శాఖ విడుదల చేసిన భారత్‌అమెరికా అధికారిక ఉమ్మడి ప్రకటనలో ఒమన్ గల్ఫ్‌లో అమెరికా దళాల దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించిన ఉదంతం గురించి ప్రస్తావన లేదని స్పష్టంచేశారు. ప్రధాని మోదీపై శశి థరూర్‌కున్న ఆరాధన భౌతిక ప్రపంచ సరిహద్దులను దాటిపోయిందని, అందుకే మోదీ అనని మాటలను కూడా ఆయన వినగలుగుతున్నారని పవన్ ఖేరా ఎద్దేవాచేశారు.

దీనికితోడు విపక్ష నేత రాహుల్ గాంధీ అభిప్రాయాలకు భిన్నంగా థరూర్ ప్రభుత్వం వైపు మాట్లాడటంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తి వ్యక్తంచేశాయి.

ఈ పరిణామాన్ని సొమ్ము చేసుకునేందుకు రంగంలోకి దిగిన బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా.. కాంగ్రెస్ అంతర్గత విభేదాలను ఎండగడుతూ రాహుల్ గాంధీ పుట్టినరోజు నాడే శశి థరూర్ ఆయనకు గట్టి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. సొంత పార్టీ నుంచే విమర్శలు వెల్లువెత్తడంతో శశి థరూర్ ఎక్స్ వేదికగా దీటుగా బదులిచ్చారు. దేశ పౌరుల ప్రాణాల రక్షణ, నావికుల భద్రత వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం వివాదంగా మార్చడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు.

ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన ఈ అంశంలో రాజకీయం చేయడం కంటే పౌరుల క్షేమం కోసం అందరూ ఏకమవ్వాలని హితవు పలికారు. అంతేకాకుండా తాను ప్రింట్ మీడియాలో వచ్చిన కథనాలు, గూగుల్ జెమిని సారాంశాల ఆధారంగానే నిజాలు మాట్లాడానని, తన జీవితంలో ఎప్పుడూ వాస్తవాలను వక్రీకరించలేదని థరూర్ సమర్థించుకున్నారు.

## టీఎంసీ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

పశ్చిమ బెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల ను అధికారులు స్తంభింపజేశారు. సుమారు రూ.440 కోట్ల నిధులున్న ఈ ఖాతాలపై వేటుపడటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీలో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తిరుగుబాటు నేత రిత్నబ్రత బెనర్జీ వర్గానికి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బిధానగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు ప్రారంభమయ్యాయి.

**పార్టీ ఖాతాల్లో జమ అయిన నిధులపై సమగ్ర విచారణ జరపాలని, అందులో 'కట్ మనీ', బలవంతపు వసూళ్లు, ప్రజాధనం దుర్వినియోగం వంటి అక్రమాలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న పోలీసులు.. కోల్‌కతాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెంట్రల్ ప్లాజా బ్రాంచ్‌లో ఉన్న పార్టీ ఖాతాల నుంచి నగదు ఉపసంహరణ నిలిపివేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఇటీవలి ఎన్నికల అనంతరం టీఎంసీలో విభేదాలు పొడచూపాయి. ఈ క్రమంలోనే పార్టీ మాజీ కోశాధికారి అరూప్ బిస్వాస్ జూన్ 12న బ్యాంకు యాజమాన్యానికి లేఖ రాస్తూ.. పార్టీలో అంతర్గత వివాదాలు ఉన్నందున లావాదేవీలను నిలిపివేయాలని అభ్యర్థించారు.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

సోమవారం | అనంతపురం
22.06.2026





# గల్ఫ్‌లో భారతీయులు భద్రమేనా?

గల్ఫ్ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్తతలు ఎగసిపడ్డాయి. కువైట్ విమానాశ్రయంపై టెహ్రాన్ దాడిలో ఒక భారతీయ పౌరుడు మరణించారు. అమెరికా స్థావరాలూ పారిశ్రామిక కేంద్రాలపై దాడులు, హర్మూజ్ గుండా వెళ్లే ఓడల్లోని భారతీయుల ప్రాణాలు కోల్పోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ వలసదారుల భద్రతపై భయాందోళనలు రేకెత్తుతున్నాయి. కొన్ని గల్ఫ్ దేశాలు వలసదారుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నా, వారి భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది.

గల్ఫ్ ప్రాంతం దశాబ్దాలుగా భారతీయ వలసదారులను ఆకర్షిస్తోంది. మొదట్లో చాలామంది అక్కడ కార్మికులుగా పనిచేసేందుకు వెళ్లేవారు. ఆ తరవాత నిపుణులుగా, పారిశ్రామికవేత్తలుగా వెళ్లడం మొదలైంది. ప్రస్తుతం సుమారు కోటి మంది భారతీయులు గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఒమన్‌లలో నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులు యూఏఈలోనే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉంటే, వారిలో మూడోవంతు మంది ఒక్క గల్ఫ్ ప్రాంతంలోనే ఉంటున్నారు. అందువల్ల భారత విదేశాంగ విధానంలో ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యముంది. భౌగోళిక సామీప్యం, ఇంధన వనరులు, చారిత్రక బంధాలు ఈ ప్రాముఖ్యతను పెంచుతున్నాయి. భారత్- గల్ఫ్ ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 18వేల కోట్ల డాలర్లు కాగా, అందులో యూఏఈ 10వేల కోట్ల డాలర్లతో అగ్రస్థానంలో ఉంది. ఎన్నారైలు భారతదేశానికి పంపుతున్న మొత్తం విదేశ మారక ద్రవ్యంలో దాదాపు 40శాతం (సుమారు 5వేల కోట్ల డాలర్లు) గల్ఫ్ నుంచే వస్తున్నాయి. ప్రారంభంలో గల్ఫ్‌కు వలసవెళ్లిన భారతీయుల్లో కేరళీయులే ఎక్కువగా ఉండేవారు. కాలక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల నుంచీ వలసలు పెరిగాయి. అక్కడ బిట్స్, మణిపాల్ వంటి భారతీయ ఉన్నత విద్యాసంస్థల్లో అనేకమంది చదువుకుంటున్నారు.

**సేవలపై చెరగని నమ్మకం**

చమురు, గ్యాస్ నిల్వలు, సమృద్ధిగా ఉండే 'సార్వభౌమ పెట్టుబడి నిధుల' కారణంగా గల్ఫ్ ప్రాంతం వ్యాపారానికీ, పెట్టుబడులకూ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది. పర్యాటకాన్ని ఆకర్షించడం, పునఃఎగుమతులను పెంచడం, సరకుల బట్వాడా, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ఏవియేషన్ హబ్‌లుగా ఎదగడంపై గల్ఫ్ దేశాలు దృష్టి సారించాయి. ముఖ్యంగా యూఏఈ దూరదృష్టితో చమురేతర రంగాలను అద్భుతంగా అభివృద్ధి చేసింది. దుబాయ్ స్వేచ్ఛా వాణిజ్య మండలాలు అంతర్జాతీయ కంపెనీలను, బ్యాంకులను ఆకర్షిస్తున్నాయి. యూఏఈ ఇస్లామిక్ షరియా సూత్రాలను ఉదారవాద పర్యాటకంతో సమన్వయించి పాశ్చాత్యులను ఆకట్టుకుంటోంది. 'గల్ఫ్ సార్వభౌమ నిధి' నిర్వాహకుల్లో ఎక్కువ మంది అమెరికావారే కావడం వల్ల పాశ్చాత్య దేశాలతో ఆర్థిక సంబంధాలు మరింత బలపడ్డాయి.

గతంలో ఇజ్రాయెల్, పాలస్తీనా, లెబనాన్ ఘర్షణలు జరిగినప్పుడూ, తరవాత ఇరాక్ యుద్ధం జరిగినప్పుడు కూడా గల్ఫ్ దేశాలు తమ వలస జనాభా ప్రభావితం అయ్యేంత పెను సంక్షోభాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదు. 2008-09 నాటి 'అరబ్ వసంతం' ఉద్యమాన్నీ కఠినంగా అణచివేశారు. గల్ఫ్ దేశాల్లో చట్టాలు పకడ్బందీగా అమలు కావడం, శాంతిభద్రతల నిర్వహణ కట్టుదిట్టంగా ఉండటం వల్ల ప్రజలు సురక్షితంగా ఉన్నామని భావిస్తారు. గల్ఫ్ దేశాలు ప్రజాస్వామ్యాన్ని అనుసరించనప్పటికీ, వాటితో అమెరికా, ఐరోపా దేశాలు సంబంధాలను బలోపేతం చేసుకున్నాయి. తమ భద్రత కోసం గల్ఫ్ దేశాలు అమెరికా సైనిక స్థావరాలను అనుమతించాయి. ఇరాన్, ఇజ్రాయెల్ వంటి ప్రాంతీయ శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉందనే భయం గల్ఫ్ దేశాలకు గతంలో ఉండేది కాదు. కానీ, ప్రస్తుత అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం తమ సొంత గడ్డలోకి పాకడం చూసి గల్ఫ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

**ఉపాధి కల్పనకు సిద్ధంగా ఉండాలి**

గల్ఫ్ పాలకులు భారతీయ కార్మికుల పట్ల నిరంతరం గౌరవాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఉదాహరణకు, ఒక గల్ఫ్ దేశ విదేశాంగ మంత్రి భారత్‌కు అధికార పర్యటన నిమిత్తం వచ్చినపుడు తన చిన్ననాటి ఆయాను చూడటానికి మంగళూరు వెళ్లారు. గల్ఫ్ రాజులలో ఒకరు మన దేశానికి చెందిన తన గణిత ఉపాధ్యాయుణ్ని ఎంతో ఆప్యాయంగా గుర్తుచేసుకున్నారు. కొవిడ్-19 సమయంలో సెలవుపై భారత్‌లో ఉన్న 500 మందికి పైగా ఆరోగ్య సిబ్బందిని ప్రత్యేక విమానాల్లో రప్పించుకోవడం మనవారి సేవాసామర్థ్యాలపై గల్ఫ్ దేశాలకు ఉన్న నమ్మకాన్ని చాటిచెబుతోంది. అక్కడ కొన్ని ప్రాంతాల్లో స్థానికులకంటే భారతీయులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, స్థానిక చట్టాలను గౌరవిస్తూ, తమ పనిపట్ల అంకితభావం ప్రదర్శిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. దాంతో స్థానికులు భారతీయులను ఎప్పుడూ ఒక ముప్పుగా భావించలేదు. లులూ గ్రూప్ అధినేత యూసుఫ్ అలీ వంటి ఎందరో భారతీయ పారిశ్రామికవేత్తలు, నిపుణులు గల్ఫ్ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. యూఏఈతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ), చర్చల దశలో ఉన్న భారత్- జీసీసీ ఎఫ్‌టీఏలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి. భారత్-గల్ఫ్ బంధంలో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నప్పటికీ- మన కార్మికులను అక్కడివారు కొందరు సరిగ్గా చూసుకోకపోవడం, నాసిరకం జీవన పరిస్థితులు, జైళ్లలో మగ్గిపోతున్న భారతీయ ఖైదీల సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా, భారతీయ సిబ్బంది స్వదేశానికి కానీ, మరెక్కడికైనా కానీ వెళ్లాలంటే గల్ఫ్ యజమాని ఆమోదం తప్పనిసరి. దీన్ని 'కాఫాలా' విధానం అంటారు. ఇది తెచ్చిపెట్టిన కష్టాల నేపథ్యంలోనే 'గోట్ లైఫ్' వంటి మలయాళ సినిమా వచ్చింది. ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని గల్ఫ్ దేశాలు తట్టుకుని నిలబడుతున్నప్పటికీ, ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే ఆర్థిక రంగాలు దెబ్బతినే ప్రమాదముంది. ఒకవేళ పరిస్థితులు తీవ్రతరమై భారతీయులు పెద్దసంఖ్యలో స్వదేశానికి తిరిగివచ్చే పరిస్థితి ఏర్పడితే, వారికి పునరావాసం, ఉపాధి కల్పించడానికి ఇండియా సిద్ధంగా ఉండాలి. విదేశాంగ శాఖ, దౌత్య కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఎన్‌ఆర్‌ఐల ప్రయోజనాలను కాపాడటానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి.



# సంకల్పం మంచిదే... అమలే సవాలు!

**ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను హేతుబద్ధీకరించి, తక్కువ విద్యార్థులున్న వేలాది పాఠశాలల స్థానంలో సమగ్ర 'క్లస్టర్ పాఠశాలలు' ఏర్పాటు చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదన విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల మధ్య విస్తృత చర్చకు దారితీసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పం ప్రశంసనీయం. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించడం సాధ్యం కావడం లేదని ప్రభుత్వం పేర్కొంటోంది. కేవలం కొద్దిమంది విద్యార్థుల కోసం వేలాది పాఠశాలలను నిర్వహించడం ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించడం కాదని వాదిస్తోంది. అందువల్ల వాటిని విలీనం చేసి, నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధన, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ విద్యా వనరులు, క్రీడా సదుపాయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత రవాణా వంటి సౌకర్యాలతో కూడిన క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.**



విద్యాపరంగా చూస్తే ఈ ప్రతిపాదనకు కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. పెద్ద పాఠశాలల్లో గణితం, విజ్ఞానం, ఆంగ్లం, సామాజికశాస్త్రం వంటి ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు పరస్పర పోటీ, సమూహ అధ్యయనం, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వ నిధులను విభజించి చిన్న చిన్న పాఠశాలలపై ఖర్చు చేయడం కంటే, కొద్ది పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అందుబాటు అత్యంత కీలకం. ప్రస్తుతం అనేక మంది పిల్లలు తమ గ్రామంలోనే లేదా నడిచి వెళ్లగలిగే దూరంలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ పాఠశాలలను విలీనం చేస్తే, వారు ప్రతిరోజూ అనేక కిలోమీటర్లు ప్రయాణించి క్లస్టర్ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది పెద్ద భారం. ప్రభుత్వం ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని ప్రకటించింది. అయితే సమగ్ర ప్రణాళిక, తగిన నిధుల కేటాయింపు, సమర్థవంతమైన పరిపాలనపై దాని విజయం ఆధారపడి ఉంటుంది. బస్సుల కొరత, రోడ్ల సమస్యలు లేదా నిర్వహణలో లోపాలు ఏర్పడితే పిల్లల హాజరు ప్రభావితమవుతుంది. ఆరు లేదా ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లలు ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణిస్తే అలసిపోతారు. చదువుకు తక్కువ సమయం,

ఆటపాటల కొరత వంటి సమస్యలు తలెత్తవచ్చు. చిన్న పిల్లలను దూర ప్రాంతాలకు పంపడానికి తల్లిదండ్రులు కూడా సంకోచించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో యుక్తవయసు బాలికలు ఎక్కువ దూరం ప్రయాణించడం పట్ల అనేక కుటుంబాల్లో ఇప్పటికీ ఆందోళనలున్నాయి. భద్రత, రవాణా, సమయపాలన వంటి అంశాల కారణంగా వారు చదువును మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, అట్టడుగు వర్గాల పిల్లలపై ఇది ప్రభావం చూపుతుంది. పాఠశాలల విలీనంతో ఉపాధ్యాయుల బదిలీలు పెరగడం, గ్రామాలతో ఏర్పడిన అనుబంధం దెబ్బతినడం, పెద్ద పాఠశాలల్లో పని భారం అధికమయ్యే అవకాశం ఉంటుంది. తగిన ఆర్థిక వనరులు కేటాయించకుండా, రవాణా వ్యవస్థను బలోపేతం చేయకుండా, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా పాఠశాలల విలీనాన్ని తొందరపడి అమలు చేస్తే గ్రామీణ పిల్లలకు ప్రతికూల ప్రభావం కలుగుతుంది. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఇది విద్యాభ్యాసంలో పెద్ద ఆటంకం. ప్రతి గ్రామానికి సమీపంలో ప్రాథమిక పాఠశాలలు కొనసాగిస్తూ, ఉన్నత తరగతుల కోసం మాత్రమే క్లస్టర్ పాఠశాలలను అభివృద్ధి చేయడం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయం. దీని అమలుకు ముందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. అమలు అనంతరం విద్యార్థుల నమోదు, హాజరు, చదువు మానివేత శాతం వంటి అంశాలను నిరంతరం పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలి.

విద్యా సంస్కరణల లక్ష్యం నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ప్రతి చిన్నారికీ విద్య అందుబాటులో ఉండేలా చూడడం కావాలి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పం ప్రశంసనీయం. అయితే ఈ క్రమంలో ఏ ఒక్క చిన్నారి కూడా దూరం, రవాణా లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరం కాకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత. మెరుగైన భవనాలు నిర్మించడం కంటే ప్రతి చిన్నారికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ఈ సంస్కరణ విజయానికి కొలమానం కావాలి.

# పాలకులే ఓటర్లను ఎన్నుకునే 'సర్'!

**స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక చీకటి అధ్యాయమైన అత్యవసర పరిస్థితి (1975–77)కి (హెబియస్ కార్పస్ కేసుగా సుప్రసిద్ధమైన) ఏడీఎమ్ జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసు (1976) ఎలాంటిదో... మన తరానికి ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్) కేసులో సుప్రీంకోర్టు తీర్పు అలాంటిది. దేశ పౌరులకు జీవించే హక్కును సైతం నిరాకరించిన తీర్పుకు నాటి ప్రశస్త న్యాయవేత్తలలో కొంతమంది ఎందుకు ఆమోదం తెలిపారో ఈ నాటికీ మనకు తెలియదు. ఆ తీర్పు వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటన్నదికాక, ప్రతి ఒక్కరూ ఆ తీర్పు నుంచి గ్రహించిన సూచనే ముఖ్యమైనది: అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంతవరకు పౌరుల ప్రాథమిక హక్కులకు సర్వోన్నత న్యాయస్థానం పూచీ వహించదు. సర్వాధికారాలూ కార్యనిర్వాహక వ్యవస్థవేనని ఆ తీర్పు నొక్కి చెప్పింది.**



ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ విషయమై సుప్రీంకోర్టు తీర్పు నిజమైన ప్రాముఖ్యం కూడా అదేనని చెప్పక తప్పదు. ప్రజాస్వామ్య ఎన్నికల చరిత్రలో అతిపెద్ద ఓట్ల తొలగింపునకు ఆ తీర్పు అనుమతినిచ్చింది. అంతేకాదు, ఓటర్ జాబితాలో కొనసాగేందుకు ఎన్ని వ్యయప్రయాసలకు లోనైనా సరే ఈసీఐ అడిగిన ధ్రువీకరణ పత్రాలను విధిగా సమర్పించాల్సిందేనని ఆ తీర్పు నిర్దేశించింది. ఓటర్ జాబితాల నుంచి ఎవరెవరు మినహాయించబడ్డారో పరిగణనలోకి తీసుకోనేలేదు. ప్రజాస్వామ్యానికి మౌలిక ప్రాతిపదిక అయిన ఓటుహక్కుకు వాటిల్లిన ప్రమాదంపై సర్వోన్నత న్యాయస్థానం అటువంటి వైఖరి చూపడం సమంజసమేనా? అదొక నైతిక వైఫల్యమే, సందేహం లేదు. నైతిక వైఫల్యమే ఆ తీర్పు ప్రధాన పాపమని న్యాయశాస్త్ర కోవిదుడు రుద్రాక్ష లక్రా నిక్కచ్చిగా విమర్శించారు. వయోజన పౌరులు ఓటుహక్కును కోల్పోవడం, మరింత స్పష్టంగా చెప్పాలంటే వారికి ఆ హక్కును నిరాకరించడం వల్ల ప్రజాస్వామ్యం ఎలా శోభిస్తుంది? ఈ అప్రజాస్వామిక చర్యకు బాధితులైన వారికి న్యాయం చేయవలసింది, చేసి తీరాల్సింది ఎవరు? రాజ్యాంగ సంరక్షుడు అయిన సుప్రీంకోర్టు కాదా? మరి ఆ అత్యున్నత ధర్మపీఠమే ఓటుహక్కు తొలగింపు బాధితులకు తన తలుపులను మూసివేయడం గర్హనీయం. ఏడీఆర్ తీర్పును భావి తరాలు ఎలా గుర్తుచేసుకుంటాయో మరి చెప్పనవసరం లేదు. ఏడీఆర్ కేసులో వాదనలు వింటున్న సందర్భంగా ద్విసభ్య ధర్మాసనంలో ఒకరైన జస్టిస్ బాగ్చీ 'కోర్టు శూన్యంలో పనిచేయదు' అని వ్యాఖ్యానించారు. బిహార్‌లో 'సర్' ప్రక్రియ ఫలితంగా ఓటర్ జాబితాల నుంచి మినహాయింపునకు గురైన ఓటర్లు ఎటువంటి నిరసన ప్రదర్శనలకు దిగలేదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన ఆ వ్యాఖ్య చేశారు. న్యాయస్థానం వెలుపల సమాజంలో నిరసనలు లేవన్న వైఖరి న్యాయ విచారణ విధానాన్ని ప్రభావితం చేయలేదని ఎలా భావించగలం? వీధి నిరసనలు లేకపోవచ్చుగానీ సర్వోన్నత న్యాయస్థానం గమనంలోకి తీసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు నెలల సమీపంలోకి వచ్చినప్పుడు సర్ ప్రక్రియ అమలును హడావుడిగా ప్రారంభించారన్న వాస్తవాన్ని సుప్రీంకోర్టు గమనంలోకి తీసుకుని ఉండాల్సింది. ఎన్నికల కమిషనర్ల నియామకాల విషయంలో ప్రభుత్వం యుక్తిగా సుప్రీంకోర్టుకు ప్రమేయం లేకుండా ఎలా చేసిందో కూడా గౌరవనీయ న్యాయమూర్తులు గుర్తు చేసుకుని ఉండవల్సింది. ఎన్నికల సంఘం ప్రధానాధికారి నిస్సిగ్గుగా పక్షపాతవైఖరితో వ్యవహరించడాన్ని ఎలా మౌనంగా చూస్తుండిపోయారు, మిలార్డ్స్? బీజేపీ, ఈసీఐ మధ్య జుగల్ బందీని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుని ఉండవల్సింది. ప్స్, సర్వోన్నత న్యాయస్థానం ఇవేవీ చేయలేదు.

నిజమే, సర్వోన్నత న్యాయస్థానం శూన్యంలో పని చేయదు. ఏదైనా ఒక విషయంలో ప్రభుత్వం ఒకసారి నిర్ణయం తీసుకుంటే దానిపై రాజ్యాంగ విహితమైన ప్రతి క్రియలకు తావు లేదు అనే సూచన ఏడీఆర్ తీర్పులో ఉందని మీరు గ్రహిస్తే మీరు క్షమార్హులే. బెయిల్ లాంటి అత్యవసర ఉపశమనానికై మీరు ఇప్పటికీ న్యాయస్థానానికి వెళ్లే వెసులుబాటు ఉంటుంది. మీ బెయిల్ మొరను న్యాయస్థానం అంగీకరించవచ్చు కూడా. అధికారంలో ఉన్న రాజకీయ పక్షానికి పెద్ద సమస్యలు ఉత్పన్నం కాని విధంగా అప్పుడప్పుడు ఉత్తేజకర తీర్పులను ఉన్నత న్యాయస్థానాలు వెలువరించవచ్చు. అయితే ప్రజాస్వామ్య వ్యవస్థను కూల్చివేసే ప్రయత్నాలను న్యాయవ్యవస్థ నియంత్రించగలదని మీరు భావిస్తే అది తప్పకుండా అమాయకత్వమే అవుతుంది. అత్యవసర పరిస్థితి కాలంలో వలే, మన గణతంత్ర రాజ్యానికి రాజ్యాంగ రక్షణ అత్యవసరమైన ప్రస్తుత సందర్భంలో కూడా సర్వోన్నత న్యాయస్థానం తన రాజ్యాంగ బాధ్యతను త్యజించింది. ఇది వాస్తవం. 'సర్'లో చట్టపరమైన లోపాలు తీవ్రంగా ఉన్నాయి. చట్టం నిర్దేశించిన స్థాపిత విధానాలను అది విస్మరించింది. ఓటర్ల నమోదు నిబంధన (1960)లనూ పట్టించుకోలేదు. అంతెందుకు ఓటర్ల జాబితాపై తన సొంత మాన్యువల్ మార్గదర్శకాలను సైతం ఉపేక్షించింది. అయినా సర్‌ను అమలుపరుస్తున్న పద్ధతులను సమర్థిస్తూ ఈసీఐ చేసిన వాదనలను సర్వోన్నత న్యాయస్థానం గుడ్డిగా విశ్వసించింది. ఆ వాదనలు విశ్వసించలేనివిగా ఉన్నాయని అనిపించినా ఆ అపనమ్మకాన్ని పక్కన పెట్టేందుకు కోర్టు సుముఖత చూపింది! 'సర్'కు ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితాల సవరణకు ఉన్న ప్రామాణిక విధానాలను పక్కన పెట్టి నియోజకవర్గాల వారీగా ఉన్న ఒక నిబంధనను ఈసీఐ ఉపయోగించుకున్నది.

న్యాయస్థానం ఇందుకు అంగీకరించింది. వలసలు, పట్టణీకరణ మొదలైన సాధారణ అంశాలను కూడా ఇందుకు పరిగణనలోకి తీసుకునేందుకు అనుమతించింది. ఈసీఐ కోరిన దానికంటే కూడా ఎక్కువ స్వేచ్ఛను ఇచ్చేందుకు కోర్టు వెనుకాడలేదు. ఇది ఎంతవరకు చట్టబద్ధం?

'సర్'కు ప్రభుత్వ మద్దతు ఉన్నది. ఈ వాస్తవాన్ని కోర్టు గ్రహించింది. ఆ ప్రకారం దానిని సమర్థించేందుకు పూనుకున్నది! రాజకీయ అజెండాలు చట్టాలను అధిగమించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది. ఎలా జరిగిందిది? న్యాయసూత్రాలను ఉద్దేశపూర్వకంగా మార్చివేసింది. వాటికి తప్పుడు భాష్యాలు చెప్పింది. లేదూ, తప్పుగా ఉటంకించింది. ఎన్నికలు, ఓటర్ జాబితాల సవరణకు సంబంధించిన కేసులలో సర్వోన్నత న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పులను పూర్తిగా ఉపేక్షించింది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే వాస్తవాలను తిరస్కరించింది. తర్కానికి తిలోదకాలు ఇచ్చింది. ఈ కారణంగా సర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలయినప్పుడు ఓటర్ జాబితాల నుంచి ఇంచుమించు పది కోట్ల ఓటర్లను మినహాయించే విపత్కర పరిస్థితికి ఆస్కారమేర్పడింది. గమనార్హమైన విషయమేమిటంటే ఈ సామూహిక తొలగింపులు వాస్తవ వయోజన పౌరుల జనాభాపై అధికారిక గణాంకాలకు విరుద్ధంగా ఉండడం. బిహార్ తుది ఓటర్ జాబితాలే అందుకు నిదర్శనం. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఓటర్ జాబితాలను సవరించడానికి బదులుగా నకిలీ, తప్పుడు వివరాలతో నింపుతున్నారని వెల్లువెత్తిన విమర్శలు ఎంత మాత్రమూ నిరాధారమైనవి కావు.

ఓటర్ జాబితాలలో ఎవరిని చేర్చాలి, ఎవరిని తొలగించాలి అనే విషయంలో కోర్టు జోక్యం చేసుకోలేదు. ఓటర్ జాబితాలను తయారు చేసే విషయంలో ఈసీఐకు పరిమితులు లేని స్వేచ్ఛనిచ్చిందని చెప్పవచ్చు. ఇదే వ్యవస్థలోని అసలు మార్పును సూచిస్తుంది. సర్‌ను సమర్థించవచ్చు. అయితే ఓటర్ల జాబితాలపై ఈసీఐ సొంత మాన్యువల్‌ను తప్పనిసరిగా అనుసరించాలని కోర్టు ఎందుకు నిర్దేశించలేదు? సర్‌ను ఎప్పుడు అమలుపరచాలి అనే విషయమై ఓటర్లకు అనుకూలమైన సమయ నిర్దేశన కూడా చేసి ఉండాల్సింది. జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశమివ్వవలసివున్నది. అలా జరిగి ఉంటే తప్పుడు కారణాలతో జాబితాల నుంచి తొలగింపబడిన ఓటర్లకు ఊరట కలిగి ఉండేది. సరైన పద్ధతులతో ఓటరుగా నమోదు కావడానికి ప్రయత్నించేందుకు వారికి వెసులుబాటు ఉండేది. 'సర్' అమలులో పారదర్శకత, బహిరంగ విచారణ ఆవశ్యకత గురించి నొక్కి చెప్పి ఉండాల్సింది. సర్ ప్రతి దశలోను మెషీన్‌పై చదవదగ్గ జాబితాను అందుబాటులో ఉంచాలని ఈసీఐని ఆదేశించి ఉండాల్సింది. తొలగింపబడిన 'చట్టవిరుద్ధమైన విదేశీయుల' సంఖ్య ఎంతో తెలపాలని కూడా ఈసీఐని అడిగి ఉండాల్సింది. ఇవన్నీ గత 75 సంవత్సరాలుగా ఈసీఐ అనుసరిస్తున్న మార్గదర్శకాలే కదా. మరి ఇప్పుడు 'సర్' విషయంలో వాటిని ఎలా పక్కన పెట్టారు? 'సర్' రాజ్యాంగ విహితమేనని, అర్హులైన ఓటర్లను రక్షించేందుకు ఈ ప్రక్రియలో విధానపరమైన భద్రతలు ఉన్నాయని నిర్ధారించిన సుప్రీంకోర్టు తీర్పు అంతిమంగా ఓటర్ జాబితాల నుంచి దేశవ్యాప్తంగా పది కోట్ల ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రాతిపదికలు కల్పించింది. రాజ్యాంగం, ప్రజాప్రాతినిధ్య చట్టం(1950)నే కాకుండా ఓటర్ల నమోదు నియమాల(1960)ను సైతం సవరించకుండా ఈ తొలగింపులు జరిగేందుకు అనుకూలతలను సృష్టించింది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విఘాతం కలిగించే మార్గదర్శకాలు, పద్ధతులను సైతం సమకూర్చింది. ఈసీఐ అండదండలతో పాలకులు ఇప్పుడు ఓటర్ జాబితాల నుంచి తాము ఇష్టపడని వ్యక్తుల లేదా ఒక సామాజిక సముదాయానికి చెందిన వారి ఓటుహక్కును రద్దుచేయడం సుసాధ్యమవుతుంది. ఇటువంటి పరిస్థితి దాపురించవచ్చని దశాబ్దాల క్రితమే జర్మన్ మహాకవి బెర్టోల్డ్ బ్రెఖ్ట్ ఊహించారు: ప్రజలు తమ పాలకులను ఎన్నుకోవడానికి బదులుగా తమకు అనుకూలంగా ఉండే ప్రజలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ పాలకులకు లభిస్తుంది!

# పీవోకేలో పాక్ పైశాచికత్వం!

**పేరుకు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)కు ప్రత్యేక జెండా, అధ్యక్షుడు, ప్రధాని ఉన్నా- ఆ ప్రాంతాన్ని శాసించేది పాకిస్థానే అన్నది జగమెరిగిన సత్యం. కశ్మీర్‌పై తాను సృష్టించిన వివాదాన్ని అంతర్జాతీయంగా సజీవంగా ఉంచేందుకు పీవోకేను వాడుకుంటున్న ఇస్లామాబాద్- అక్కడి ప్రజలను రాజకీయంగా అణగదొక్కుతూ, వారి కనీస హక్కులనూ కాలరాస్తోంది. స్థానిక సమస్యలను పట్టించుకోకుండా అమానవీయంగా వ్యవహరిస్తోంది. పాక్ దుర్మార్గాలపై జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేకేజేఏఏసీ) ఆధ్వర్యంలో లోగడ పీవోకేలో పెద్దయెత్తున నిరసనలు వెల్లువెత్తి రక్తపాతానికి దారితీశాయి. త్వరలో అక్కడి లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న తరుణంలో తాము ఎదుర్కొంటున్న ఆర్థిక అగచాట్లపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ, హక్కుల నిరాకరణను నిరసిస్తూ పీవోకే ప్రజానీకం మళ్లీ రోడ్లపైకి వచ్చింది. పాకిస్థాన్‌లోని జమ్మూకశ్మీర్ వలసదారులకు పీవోకే అసెంబ్లీలో 12 సీట్లను రిజర్వు చేయడం ద్వారా ఆ ప్రాంతం మీద పాక్ తన భల్లూకంపట్టును విస్తరించడంపై స్థానిక జనసామాన్యం మండిపడుతోంది. దానిపై ఉద్యమిస్తున్న జేకేజేఏఏసీపై ఉగ్రవాద సంస్థ అనే ముద్రవేసి, ఇస్లామాబాద్ దాన్ని తాజాగా నిషేధించింది. పాకిస్థాన్ పాపాలను తూర్పారపడుతూ, నిత్యావసరాల ధరాభారాన్ని తగ్గించాలంటూ గళమెత్తిన పీవోకే వాసులపై పాక్ సైన్యం విచ్చలవిడిగా కాల్పులకు తెగబడి పలువురి ప్రాణాలను బలిగొంది. న్యాయం అడిగిన వారి నెత్తురు కళ్లజూడటం ద్వారా పాకిస్థాన్ తన పైశాచికత్వాన్ని మరోసారి బయటపెట్టుకుంది.**

యాభై లక్షలకు పైగా జనాభా కలిగిన పీవోకేలో ఆర్థిక వృద్ధి పడకేసింది. నిరుద్యోగం 11శాతం దాకా పెరిగింది. యువతలోనైతే అది 27శాతానికి చేరింది. స్థానికంగా భారీ పరిశ్రమలు లేకపోవడంతో అధికశాతం జనాభాకు సాగురంగం, విదేశాల్లో కష్టపడుతున్న కుటుంబసభ్యులు పంపే సొమ్ములే జీవనాధారాలవుతున్నాయి. పర్యావరణ మార్పుల కారణంగా ఇటీవల పంట దిగుబడులు తెగ్గోసుకుపోతున్నాయి. కట్టుతప్పిన ద్రవ్యోల్బణం ధాటికి ఉన్న అరకొర ఆదాయాలూ హరించుకుపోతున్నాయి. విద్యుదుత్పత్తిలో పీవోకే ముందున్నా, కరెంటు బిల్లుల మోతతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. సుదీర్ఘ విద్యుత్ కోతలతో సతమతమవుతున్నారు. రోడ్లు, ఆసుపత్రులు, బడులు వంటి మౌలిక వసతులూ చాలినన్ని లేవు. ఆర్టికల్ 370 రద్దు తరవాత జమ్మూకశ్మీర్‌లో ఊపందుకుంటున్న ప్రగతి పనులను చూసి పీవోకే వాసుల్లో నిరాశ, నిస్పృహలు కమ్ముకొంటున్నాయి. ఈ క్రమంలోనే తాము భారత్‌లో కలిసిపోతామన్న స్థానికుల నినాదాలు గతంలో గిల్గిత్, బాల్టిస్థాన్‌లో మిన్నంటాయి. ఇలా పీవోకేలో తన పట్టు సడలిపోతోందన్న భయంతోనే ప్రజా ఉద్యమాలపై పాకిస్థాన్ ఉక్కుపాదం మోపుతోంది. తాజా నిరసనలనూ అలాగే నిర్దయగా అణచివేయాలని పాక్ సైన్యాధిపతి అసీమ్ మునీర్ ఆదేశించడం దాయాది దేశ దమననీతికి అద్దంపడుతోంది! పీవోకేలో అస్థిరత మాటున జమ్మూకశ్మీర్‌లోకి చొరబాట్లను పాక్ ప్రేరేపించే ప్రమాదముంది. ఈ విషయంలో ఇండియా అప్రమత్తంగా మెలగాలి. పీవోకేలో ఉద్రిక్తతలకు భారతదేశానిదే బాధ్యత అంటూ ఇస్లామాబాద్ వండివార్చే విషప్రచారాన్ని నేర్పుగా తిప్పికొట్టాలి. చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ప్రాంతంలో ఆందోళనలు పెరిగితే, ప్రాజెక్టుల రక్షణ పేరిట బీజింగ్ నేరుగా రంగంలోకి దిగవచ్చు.

# ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయండి



- ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు
- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా చేసిన సునీత
- మీ ఆరోగ్యం కోసం రోజులో ఒక గంట యోగా చేయాలని పిలుపు

**రాప్తాడు జూన్ 21,అనంత జనశక్తి న్యూస్**

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని తన నివాసంలో ఆమె యోగాసనాల సాధన చేశారు.సూర్యోదయాన ఆసనాలు వేస్తూ.. ప్రశాంత వాతావరణంలో గడిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మనిషి ప్రతి రోజు హుషారుగా ఆరోగ్యంగా ఉండాలంటే.. యోగాను తప్పనిసరి అలవాటుగా చేసుకోవాలన్నారు. రోజుకో గంట యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేస్తే.. ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరమే ఉండదన్నారు. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన దేశానికి వారసత్వ సంపదగా వచ్చిన యోగాను ప్రోత్సహిస్తున్నారన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూస్తున్నారన్నారు.ఆధ్యాత్మికత, యోగా సాధనతో హెల్తీ, వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని.. ఇందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే



సునీత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే సునీత కలిశారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపారు...

# జీవన శైలిలో యోగాను ఒక భాగం చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి జూన్ 21:అనంత జనశక్తి న్యూస్**

మానవ జీవన శైలిలో యోగాను ఒక భాగం చేసుకోవలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ,ఎస్పీ సతీష్ కుమార్ విద్యాగిరి వేదికపై జరిగిన యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా అధికారులు, విద్యార్థి లోకం మరియు యోగా సాధకులతో కలిసి ఆయన ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కింది ముఖ్య విషయాలను పంచుకున్నారు:నిత్య జీవితంలో యోగా ప్రాధాన్యత: ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని, దీని ద్వారా శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పిలుపునిచ్చారు. యోగా చేయడానికి పెద్దగా స్థలం లేదా ఖరీదైన పరికరాలు అవసరం లేదని, కేవలం ఒక మ్యాట్ (చాప) ఉంటే ఇళ్లలోనే సులభంగా సాధన చేయవచ్చని తెలిపారు.శరీరాన్ని శ్రమింపజేస్తూ, మనస్సును అంతర్ముఖం వైపు మళ్లించి ప్రశాంతంగా ఉంచుకోవడానికి యోగా ఎంతో దోహదపడుతుందని వివరించారు.ఈ సందర్భంగా 76సంవత్సరాల వయసులోనూ ఎంతో చురుగ్గా, యువకులకు స్ఫూర్తినిచ్చేలా యోగాసనాలు వేసిన నారాయణ రెడ్డి ని మరియు రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ప్రధానమంత్రి పిలుపుతో దేశవ్యాప్తంగా, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమరావతిలోనూ ఈ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని గుర్తుచేశారు. మన శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామ స్థాయిల్లో ఈ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగానిర్వహించినందుకు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తో పాటు ఇతర అధికారులకు, విద్యార్థులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పి అంకిత సురన, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,

డిఆర్‌డిఏ పిడి నరసయ్య,జిల్లా అధికారులు, విద్యార్థులు తధితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో రూ.6.33కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశాం



- వైసీపీ హయాంలో ఎంత మందికి సాయం చేశారో చెప్పగలరా..?
- 41మందికి రూ.29.70లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**అనంతపురం జూన్ 21,అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోసీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.6.33కోట్ల రూపాయలు సాయం చేశామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అదే ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంతమంది, ఎంత సాయం చేశారా చెప్పగలరా అని సవాల్ విసిరారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 31వ విడుతలో భాగంగా మొత్తం 41మందికి రూ.29.70లక్షల రూపాయల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో ఈ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. ఎక్కడ ఎవరికి ఇబ్బంది ఉన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారన్నారు.ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృతం చేయడంతో పాటు అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారికి కూడా ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. ఈ రెండేళ్లలో 637మందికి 6కోట్ల 33లక్షలకు పైగా సాయం చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏ రోజు ఇలాంటి సాయం అందలేదన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని కనీసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అర్బన్ నియోజకవర్గ ప్రజలకు ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నాయుడుకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నియోజకవర్గంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సుడిగాలి పర్యటన



- వివాహాలు, గృహప్రవేశాలకు హాజరు – కార్యకర్తలకు పరామర్శ, ఆర్థిక సాయం

**పుట్టపర్తి, జూన్ 21: అనంత జనశక్తి న్యూస్**

పుట్టపర్తి నియోజకవర్గంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వివాహాలు, గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తల ఆహ్వానం మేరకు ఆయన పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా నల్లమాడకు చెందిన శ్రీబాలాజీ విద్యాసంస్థల అధినేత వలిసిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కుమార్తె డాక్టర్ బుతేష రెడ్డి - డాక్టర్ జయసూర్య రెడ్డిల వివాహ వేడుకకు కదిరిలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం కదిరిలో జరిగిన కీర్తన - పూర్ణచంద్ర నాయుడుల వివాహానికి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులతో పాటు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అలాగే పుట్టపర్తిలోని సాయి ఆవరణంలో జరిగిన సాయి ప్రవల్లిక - సిసింద్రీల వివాహం, కొత్తచెరువు శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన దేవిశెట్టి కార్తీక్ కుమార్ - పప్పసాని శ్రీలేఖల వివాహం, మైలసముద్రం గ్రామంలో జరిగిన ఓం సాయి - మౌనికల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.కొత్తచెరువు మండలం పోతులకుంటలో మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు నిర్మించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు టీడీపీ కార్యకర్తల నివాసాలకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఆర్థిక సహాయం అందజేసి, పల్లె కుటుంబం ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పర్యటనలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగాతో మానసిక, శారీరక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది

- అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- కలెక్టర్, ఎస్పీలతో కలిసి యోగాంధ్ర-2026లో పాల్గొన్న ఎమ్మెల్యే
- యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే

**అనంతపురం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

యోగాతో అనేక మానసిక, శారీరక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన యోగాంధ్ర 2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జిల్లా అధికారులు, టీడీపీ నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్లు అందరిచేత యోగాసనాలు వేయించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆసనాలు వేస్తూ ఉల్లాసంగా గడిపారు. గత నెల రోజుల నుంచి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగాంధ్రపై పలు పోటీలు నిర్వహించగా అందులో గెలుపొందిన సుమారు 50 మందికి మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రధానిగా మోదీ వచ్చిన తర్వాత యోగా విశిష్టతను అందరూ తెలుసుకుంటున్నారన్నారు. గతంలో యోగా అంటే



తెలిసేది కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని ఒక ప్రక్రియగా తీసుకొచ్చి... యోగాని ఒక భాగంగా చేశారన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేస్తే మానసిక, శారీరక, ఇతర రకాల సమస్యలన్నీ దూరమవుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంతకుముందు విశాఖపట్నంలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరిగిందని, అప్పటినుంచి ప్రతి ఇంట్లోనూ యోగా భాగస్వామ్యం అయిందన్నారు. మన ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన కార్యక్రమంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# స్వతంత్ర పార్క్‌లో మంత్రి నారాయణ యోగాసనాలు.



- స్వతంత్ర పార్క్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాతోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యం: మంత్రి నారాయణ
- నాడు అధ్వాన్నం.. నేడు అద్భుతం: స్వతంత్ర పార్క్‌పై మంత్రి నారాయణ వ్యాఖ్యలు.
- ప్రతి ఇంట్లో యోగా సాధన జరగాలి: మంత్రి నారాయణ .
- యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధానిదే.రాష్ట్రంలో అన్ని సచివాలయాల్లో వేడుకలు-మంత్రి నారాయణ

**నెల్లూరు జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల్లూరు గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్క్‌లో అదివారం జరిగిన యోగా వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు.వాకర్స్,కరాటే విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అయిన యోగాకు ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లో గుర్తింపు తేవడం భారతీయులందరికీ గర్వకారణమని, దీనికి కృషి చేసిన ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని సచివాలయాల్లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.2024 నాటికి అస్తవ్యస్తంగా ఉన్న స్వతంత్ర పార్క్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంపిక చేసిన 45 పార్కుల్లో చేర్చి, పచ్చదనంతో అద్భుతంగా పునరుద్ధరించామని వెల్లడించారు. పార్క్‌ను ఇంత అందంగా తీర్చిదిద్దిన , కమిషనర్ తో పాటు మున్సిపల్ అధికారులను ,స్థానికులకు ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్న ట్రైనర్ విక్రమ్‌ను మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో రోజూ కొద్ది నిమిషాల పాటు యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ హిమబిందు, స్థానిక నాయకులు పోకల రవి తదితరులు పాల్గొన్నారు

# విద్యావ్యవస్థలో నెల్లూరును నంబర్ వన్ చేస్తా: మంత్రి నారాయణ



- పేద పిల్లలకు ఇంటర్నేషనల్ చదువులు.
- పీ4 విధానంపై వైఎస్సార్సీపీ కుట్రలను తిప్పికొట్టిన మంత్రి నారాయణ.
- నాడు మూతపడ్డాయి.. నేడు కార్పొరేట్‌ను మించి ముస్తాబవుతున్నాయి:
- నెల్లూరులో విద్యా విప్లవం
- 20 కోట్ల సీఎస్సార్ నిధులతో అద్భుతం.
- నెల్లూరు ప్రభుత్వ స్కూల్‌ను మార్చేసిన దాతృత్వం
- కార్పొరేట్ ఫీజులు లేవు.ప్రభుత్వ స్కూళ్లలోనే ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్

**నెల్లూరు జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరులో కార్పొరేట్‌ను మించిన రీతిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్యావ్యవస్థలో మంత్రి నారా లోకేష్ తెస్తున్న విప్లవాత్మక మార్పుల్లో భాగంగా నెల్లూరు నగరంలోని మూలాపేట బాలికోన్నత పాఠశాలను 20 కోట్ల సీఎస్సార్ నిధులతో డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.స్కూల్ ఆధునీకరణ పనులను,అత్యాధునిక ప్లే గ్రౌండ్‌ను మంత్రి నారాయణ ఆదివారం స్వయంగా పరిశీలించి, దాతలను అభినందించారు. అనంతరం డిఈఓ బాలాజీరావు, ఉపాధ్యాయులతో అడ్మిషన్లపై సమీక్ష నిర్వహించారు.పాఠశాల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ సొంతనిధులు,సీఎస్ఆర్ ఫండ్స్ తో ప్రభుత్వ స్కూల్స్ ను ఆధునీకరిస్తుంటే అవినీతి జరిగిపోతోందని వైఎస్ఆర్సిపి నేతలు మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.గత ప్రభుత్వం మూసేసిన విఆర్సీ స్కూల్‌ను తెరిపించి 1100 మంది పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు.అదే తరహాలో మూలాపేట స్కూల్‌లో తొలి విడతగా 24 వేల చదరపు అడుగుల నిర్మాణం పూర్తి చేసి, ఈ ఏడాది నుంచే నర్సరీ నుండి 10వ తరగతి వరకు తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.పీ4 విధానం ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తుంటే ఓర్వలేక వైఎస్సార్సీపీ కుట్రలు, విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.నారాయణ విద్యాసంస్థల కంటే మెరుగ్గా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతానని, మరో 13 పాఠశాలలను కూడా అభివృద్ధి చేసి విద్యావ్యవస్థలో నెల్లూరును దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెడతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,డిఈఓ బాలాజీ రావు,ఎంఈఓ తిరుపాలయ్య,సర్వశిక్ష అభయాన్ పీడీ సుబ్బయ్య,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,డిఎస్ఆర్ కనస్టక్షన్స్ కంపెనీ ప్రతినిధి అనీల్,ప్రిన్సిపాల్ పద్మావతి,కార్పొరేటర్ కరిముల్లా,డివిజన్ ప్రెసిడెంట్ మనోహర్,టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# యోగాతో మానసికోల్లాసం

**నారాయణ రత్నం సిబిఎస్ఈ స్కూల్లో యోగా దినోత్సవం వేడుకలు**

**నెల్లూరు జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధనలక్ష్మిపురంలోని నారాయణ'స్ రత్నం సీబీఎస్ఈ, నారాయణ సీబీఎస్ఈ స్కూల్స్ లో యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. యోగా గురువులు విద్యార్థులకు పలు ఆసనాలను చేయించి, యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లస్టర్ ప్రిన్సిపాల్ కాంతి , ప్రిన్సిపాల్ రాజేశ్వరి, జోనల్ కోఆర్డినేటర్ వరలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశారు.



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం...



**- ధనలక్ష్మిపురం నారాయణ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**

**నెల్లూరు జూన్ 21 అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు నగరంలోని స్థానిక ధనలక్ష్మిపురం నందుగల నారాయణ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ యోగా డే ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు ఎంత ఉత్సాహంగా వివిధ రకాల యోగాసనాలు వేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం శ్రీనివాసులు రెడ్డి హాజరై యోగ యొక్క విశిష్టతను విద్యార్థినిలకు వివరించారు.నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థులకు చదువుతోపాటు క్రమం తప్పకుండా యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నేడు ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో బాలికలకు యోగ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతోపాటు స్కిల్ డెవలప్మెంట్ క్రీడా పోటీలు యోగా వంటి కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు ప్రతిఒక్కరు క్రమం తప్పకుండా ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రజ, డీన్ స్రవంతి, ఏవో, విద్యార్థినిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రాశాంతత కోసం యోగా..ఎమ్మెల్యే అమిలినేని



**- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**
**- యోగా ఉపాసకులతో కలసి ఆసనాలు వేసిన ఎమ్మెల్యే అమిలినేని**
**- ఉదయాన్నే సూర్య భగవానుడిని నమస్కరించి యోగా ప్రారంభిస్తాం**

**కళ్యాణదుర్గం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

శే ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాకు ప్రాముఖ్యత కల్పిస్తూ ప్రతి ఒక్కరు ఆచరించి మానసిక ప్రశాంతతతో వ్యాదుల నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యం సాధించుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజావేదిక నందు పట్టణంలోని పురప్రముఖులు, యోగా ఉపాసకులు, టీడీపీ నాయకులు, విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ఆర్డీఓ వసంత్ బాబు , కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, మున్సిపల్ కమీషనర్ వంశీ కృష్ణ భార్గవ్ పోలీసు సిబ్బంది పాల్గొని ఆసనాలు వేయడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఏడు పదులు దాటిన వయసులో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం 18 గంటల పాటు పనిచేస్తున్నారు అంటే ఆయన ప్రతి రోజు పాటించే యోగా ఆసనాలే కారణం..ప్రతి నిత్యం ఎంత పని ఉన్నా ఏమాత్రం అలసిపోకుండా పనిచేస్తున్నారు అంటే మనం అందరం అర్థం చేసుకుని ప్రతి రోజు ఒక గంట సేపు యోగాకు సమయం కేటాయించి మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందాలని అన్నారు..మన ప్రాంతానికి యోగా అనేది చాలా అవసరం అని, అలాగే రాళ్లనంతపురం గ్రామంలో పాఠశాల తనిఖీ చేయడానికి వెళితే అక్కడి విద్యార్థులు తమకు యోగా మ్యాట్లు కావాలని అడిగారు అంటే వారికి ఈ వయసులోనే అలాంటి ఆలోచన రావడం నిజంగా గొప్ప విషయం..నేడు ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు అంటే అది మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కే దక్కుతుందన్నారు.. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలో యోగా చేసేందుకు నగరవనంలోనే ఏర్పాటు చేసే అవకాశాన్ని జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి అందరికి అందుబాటులో ఉండేలా చూస్తామని తెలిపారు.. అనంతరం యోగా గురువులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సన్మానించి వారికి జ్ఞాపికను బహుకరించారు..

### ట్టుదిట్టమైన భద్రత నడుమ అనంతపురంలో

## నీట్ రీఎగ్జామ్ నిర్వహణ

**అనంతపురం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (NEET) రీఎగ్జామ్ సందర్భంగా పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ స్వయంగా పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును సమీక్షించారు.ఎస్ఎస్బీఎన్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేఎస్ఎన్ కళాశాల, జేఎన్టీయూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ, కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా, ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలతో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పరీక్ష ముగిసే వరకు కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించిన ఎస్పీ, పరీక్షల నిర్వహణలో పోలీసు అధికారులు, కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, రూరల్ డీఎస్పీ టి. శ్రీనివాసులు, ఎస్బీ సీఐ ధరణీ కిశోర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# సజావుగా నీట్ పునఃపరీక్ష..




**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, జూన్ 21 :అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో సజావుగా నీట్ పునఃపరీక్ష నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కాలేజ్ లో, నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ (ఆర్ట్స్ కాలేజ్) వద్దనున్న గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ బాయ్స్, నగరంలోని ఆర్టీవో ఆఫీస్ వద్దనున్న కేఎస్ఎన్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ అనంతపురం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జేఎన్టీయూ ఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ( అటోనమస్), నగరంలోని ఇంజనీరింగ్ కాలేజీ రోడ్లో ఉన్న గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ లలో జరుగుతున్న నీట్ పునఃపరీక్షను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పునఃపరీక్షను ఎటువంటి ఇబ్బంది లేకుండా సి.ఆర్.పి.ఎఫ్ సపోర్టుతోనే ప్రశ్నాపత్రాలను షిఫ్ట్ చేయడం జరిగిందన్నారు.నగరంలోనే ఐదు కళాశాలల్లో జరుగుతున్న నీట్ పునఃపరీక్షను పరిశీలించడం జరిగిందని, ఎక్కడా ఇబ్బంది లేకుండా నీట్ పునఃపరీక్షను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతి లొకేషన్ లోనూ అనౌన్స్మెంట్ చేస్తున్నామని, కటాఫ్ టైం ఒక సెకండ్ దాటినా కూడా ఎవరిని అనుమతించడానికి వీలులేదని, అది కూడా అందరికీ చెప్పడం జరిగిందని, దీనిపై అనౌన్స్మెంట్ కూడా చేస్తున్నామని, కటాఫ్ టైం కు అయిదు నిమిషాలు ముందు నుంచి ప్రతి నిమిషం అనౌన్స్మెంట్ చేపిస్తున్నామన్నారు.పరీక్ష కేంద్రాల చుట్టుపక్కన జిరాక్స్ కేంద్రాలను మూసివేయడం జరిగిందని, సెక్షన్ 144 అమలు చేస్తున్నామని, ఈ చుట్టుపక్కల ఎవరూ కలిసి ఉండడానికి వీలులేదన్నారు.ఎటువంటి ఇబ్బంది రావడానికి వీలు లేకుండా పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

పరీక్ష సమయం అయిపోయిన తర్వాత స్క్రైబ్స్ కి అదనంగా సమయం ఉంటుందని, పరీక్ష పూర్తి అయ్యాక డిపార్ట్మెంట్ ద్వారా ప్రశ్నాపత్రంలను తరలించడం జరుగుతుందని తెలిపారు.అనంతపురం నగరంలో 7 కేంద్రాల్లో, గుత్తి పట్టణంలో 2 కేంద్రాల్లో నీట్ పునఃపరీక్ష నిర్వహించగా, జిల్లాలో మొత్తం 9 కేంద్రాల్లో 3,960 మందికి గాను, 3,508 మంది హాజరుకాగా, 452 మంది గైర్హాజరు అవ్వగా, 88.58 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు.

# యోగాతో మానసికోల్లాసం




**- నారాయణ రత్నం సీబీఎస్ఈ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో యోగా దినోత్సవం వేడుకలు**

**నెల్లూరు జూన్ 21 అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధనలక్ష్మిపురంలోని నారాయణ'స్ రత్నం సీబీఎస్ఈ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు గుంటూరు రేవతి విద్యార్థులతో వివిధ రకాల ఆసనాలు ప్రాణమాయం తదితర విన్యాసాలను చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. యోగా గురువులు విద్యార్థులకు పలు ఆసనాలను చేయించి, యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగా ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగమణి మాట్లాడుతూ 12వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా వావిలేడుపాడు రోడ్డు లోని నారాయణ సీబీఎస్ఈ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో యోగా దినోత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు కేవలం క్లాస్ రూములకే పరిమితం కాకుండా యోగా నిర్వహించడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు.విద్యార్థులు ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు అలాగే నేడు ప్రపంచ ఫాదర్స్ దినోత్సవం సందర్భంగా ఫాదర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని విద్యార్థుల తండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై ఎంతో వారితో ఆటలాడుతూ ఆనందంగా గడపడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## ఆ గ్రామస్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ...

**- 24 గంటల్లో పరిష్కారం చూపారు.**
**- పుట్టపర్తి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**

**ఓడి చెరువు జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

గ్రామంలో గత నాలుపు రోజులుగా నీటి సమస్య ఉందని మామిళ్ళకుంట్లపల్లి గ్రామస్తులు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో తక్షణం కొత్త బోరు వేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చేయాలని మండల అధికారులకు సూచించారు. నిన్నటి రోజున ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి శనివారం ఓడి చెరువుకు విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి మామిళ్ళకుంట్లపల్లికి చెందిన టీడీపీ నాయకులు ఉన్న పాత బోరుబావిలో మోటారు ఇరుక్కొని రాలేదని దీని వల్ల నీటి సమస్య ఉందని చెప్పడంతో వెంటనే పక్కన నూతన బోరు వేసి కొత్త మోటర్ బిగించి నీటి సమస్య కు పరిష్కారం చూపాలని మండల స్పెషల్ ఆఫీసర్ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో శివప్రసాద్, ఆ గ్రామ కార్యదర్శి శ్యామ్ కుమార్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదివారం మామిల్లకుంట్ల పల్లి గ్రామ కార్యదర్శి శ్యామ్ కుమార్ , మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తక్షణం నూతన బోరు వేశారు. కొత్త బోరు వేయడంతో గ్రామంలో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డికి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కి మామిళ్ళకుంట్లపల్లి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## పేద ప్రజల కంట వెలుగులు నింపుతున్న: జడ్పీటీసీ వి ఉమేష్



**- కంటి వైద్య పరీక్ష శిబిరాలలో అనూహ్య స్పందన**

**అగళి జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలోని హై స్కూల్ నందు ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభిస్తోంది వృద్ధులు, కంటి సమస్యలు ఉన్న పేదలు అధిక సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందని మండల జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ ఉమేష్ మసకబారిన కళ్ళలో మళ్ళీ కాంతిని నింపుతున్నరూ, పేద కంటి వైద్య నికి పెద్ద పీట వేస్తున్నారు.జిల్లా అధ్యక్షులు, మడకశిర ఎమ్మెల్యే ఏం. ఎస్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్షల్లో 165 మందిని పరీక్షించించారు. ఇందులో 47మందిని కంటి ఆపరేషన్ ఎంపిక అయ్యారు. శిబిరానికి వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆపరేషన్ కు ఎంపిక అయిన వారిని శంకర్ కంటి ఆపరేషన్ వారి ప్రత్యేక వాహనంలో వీరిని బెంగళూరు కు పిలుచుకొని వెళ్ళి ఆపరేషన్ చేయించుకొని మళ్ళీ పిలుచుకొని వచ్చి వదలడం జరుగుతుందని మండల జడ్పిటిసి వి ఉమేష్ తెలిపారు. మిగతా వారికి కంటి అద్దాలు మాత్రలు పంపిణీ చేయనున్నారు.

### మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నిర్మూలనపై

# విస్తృత అవగాహన కార్యక్రమాలు...




**-జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా శక్తి బృందాల ప్రచారం.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**

**జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో శక్తి బృందాలు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాల్లో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ బస్టాండ్లు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థల పరిసరాలు, రద్దీ ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని భద్రతా సూచనలు అందించారు.

మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా ఎలా సహాయం పొందవచ్చో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మహిళలు, చిన్నారులపై జరిగే వేధింపులు, నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం డయల్ 100 / 112, మహిళల సహాయానికి 181, బాలల రక్షణ కోసం 1098 హెల్ప్‌లైన్ నంబర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఏటీఎం మోసాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మరాదని హెచ్చరించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ వంటి గోప్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.

అదేవిధంగా యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు వాటి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ప్రజల భద్రత, మహిళల రక్షణ, సైబర్ నేరాల నివారణ మరియు డ్రగ్స్ నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం చర్యలు కొనసాగిస్తుందని శక్తి బృందాలు తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# యోగాతోనే మనసుకు ప్రశాంతత...

**- యోగ ఆరోగ్యంతో పాటు శరీరక దృఢత్వాన్ని పెంచుతుంది..**
**- ఎన్ సి సి కేర్ టేకర్ ఆఫీసర్ నాగేంద్ర.**




**ధర్మవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

యోగ ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వాన్ని కూడా పెంచుతుంది అని ఎన్ సి సి కేర్ టేకర్ ఆఫీసర్ నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మవరం 6వ ఆంధ్ర బెటాలియన్ యూనిట్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగ ఆసనాలలో ఉత్సాహంగా పాల్గొని, ఎన్ సి సి ప్రదర్శన నిర్వహించారు. తదుపరి ఎన్సిసి లో యోగా లైఫ్ అంత హోగా అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేర్ టేకర్ ఆఫీసర్ నాగేంద్ర మాట్లాడుతూ.... 6 ఏ ఆంధ్ర బి న్ ఆదేశాల మేరకు సోషల్ సర్వీస్ & కమ్యూనిటీ డెవలప్మెంట్ ఆక్టివిటీస్ ఎన్ సి సి క్యాడెట్స్ యోగాసనాల్లో పాల్గొని ప్రతిరోజు క్యాడెట్స్ తో పాటు కుటుంబ సభ్యులు అందరూ నిత్య జీవితంలో యోగ ని భాగంగా చేసుకున్నట్లయితే మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నట్లేనని తెలిపారు. తనువుకి యోగ చేసినట్లయితే మనసుకి ప్రశాంతత కలుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణప్ప, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భారతదేశం యోగా ని ప్రపంచానికి అందించిన గొప్ప సంపద..



**- మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య.**

**ధర్మవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

యోగ అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగా మాస్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో యోగ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... యోగ అనేది వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా కూడా యోగ అభ్యసన చేస్తే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. యోగాతో ఆరోగ్యము, ఆనందము కూడా తప్పక లభిస్తుందని తెలిపారు. యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు అని మనసు, శరీరము, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే జీవన విధానము అని వారు తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగ కీలకపాత్ర పోషిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయభాస్కర్, సచివాలయ ఉద్యోగుల అధికారి అశ్వత నారాయణ, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్ రెడ్డి, యోగా మాస్టర్లు నరసింహులు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, భువనేశ్వరి, రామన్న, తిరుమలేష్, రవి, జ్యోతి తో పాటు దాదాపు 500 మంది యోగ కార్యక్రమాల్లో పాల్గొని, చక్కటి ప్రదర్శన నిర్వహించారు.



# వేణు మోటార్స్ ఎలక్ట్రిక్ టూ వీలర్ షోరూమ్ ఘన ప్రారంభం

**ధర్మవరం జూన్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని యర్రగుంట సమీపంలో నూతనంగా నిర్మించిన వేణు మోటార్స్ ఎలక్ట్రిక్ టూ వీలర్ షోరూమ్ ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. షోరూమ్ యాజమాని వేణు ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌ను పరిశీలించిన చిలకం మధుసూదన్ రెడ్డి కి సంస్థ నిర్వాహకులు షోరూమ్ విశేషాలు, అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ టూ వీలర్ మోడళ్లు, సేవల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశ వ్యాప్తంగా సుమారు 80 షోరూమ్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్న వేణు ధర్మవరం వాసి కావడం గర్వకారణమని పేర్కొన్నారు. స్థానిక స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి యువ పారిశ్రామికవేత్తలకు ఆదర్శంగా నిలుస్తున్న వేణు కృషి ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో వేణు మోటార్స్ మరింత అభివృద్ధి సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, సంస్థ యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవ వేడుకలు ప్రారంభం..

**- అడ్డ హక్ చైర్మన్ చర్మం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు.**

**ధర్మవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జూన్ 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు మూడు రోజులు పాటు కుంభాభిషేక మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అడహాక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర్ ప్రసాద్ ఆలయ ఈవో వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు సోమవారం సాయంత్రం దేవతా ప్రార్థన, రక్షాబంధన, విశ్వకేశన ఆరాధన, అంకురార్పణం ,అగ్ని ప్రతిష్ట ,పరిహార దేవతలు కలశారాధన, వివిధ హోమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు స్వామి వారు, అమ్మవారి ఆలయాన్ని కూడా స్పర్శ దర్శనం చేసే అవకాశం ఉందని తెలిపారు.జూన్ 23న కళాజ్యోతి నందు త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార్, రామానుజ జీయర్ స్వామి వారిచే ప్రవచనం జరుగునని తెలిపారు. తదుపరి జూన్ 24న ఇదే స్వామీజీ ఉపస్థితిలో కుంభాభిషేక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కావున ఈ మహోత్సవ వేడుకలకు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.





# సిఐ గా బాధ్యతలు చేపట్టిన జయ నాయక్.

**ధర్మవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా జయ నాయక్ పదవి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వీరు రాయదుర్గంలో సిఐ గా విధులు నిర్వర్తిస్తూ, రాజకీయాలకు అతీతంగా పోలీస్ శాఖలో మంచి గుర్తింపును పొంది అనంతపురం జిల్లా నుంచి పుట్టపర్తి జిల్లాకు వారు ధర్మవరం టూ టౌన్ సిఐగా రావడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్ లో ఎస్సై, ఇతర సిబ్బంది జయ నాయక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జయ నాయక్ మాట్లాడుతూ... టూ టౌన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించరాదని, అలా నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు అని తెలిపారు. చట్టాలను అందరూ గౌరవించి చట్టపరంగానే జీవించాలని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా కూడా పరిష్కరించే దిశగా తాను కృషి చేస్తానని తెలిపారు. మట్కా, జూదం, పేకాట, అక్రమ మద్యం లాంటి వాటికి దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువతి, యువకులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. అనంతరం ఇంచార్జ్ డిఎస్పి నర్సింగప్పను గౌరవపూర్వకంగా కలిసి, టూ టౌన్ స్టేషన్ సమస్యలను వారు వివరించారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం

**- రిపేర్‌లో ఉన్న మంచినీటి బోరును బాగు చేయించిన...**
**- బీజేపీ వార్డ్ ఇన్‌చార్జ్ ఓం ప్రకాష్ గౌడ్...**

**ధర్మవరం జూన్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని సాయినగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా రిపేర్‌లో ఉన్న మంచినీటి బోరును స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు బీజేపీ వార్డ్ ఇన్‌చార్జ్ ఓం ప్రకాష్ గౌడ్ ఆదివారం బాగు చేయించారు. మున్సిపాలిటీ నీటి సరఫరా అందుబాటులో లేని రోజుల్లో కాలనీవాసులు ఈ బోరు నీటిపైనే ఆధారపడుతున్నారని స్థానికులు తెలిపారు. అయితే బోరు చెడిపోవడంతో గత కొద్ది రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. స్థానికుల సమస్యను గుర్తించిన ఓం ప్రకాష్ గౌడ్ వెంటనే స్పందించి బోరును రిపేర్ చేయించడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపినందుకు స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# కొత్తపేట లో కొలువుతీరిన పీర్లు.

**- హిందూ ముస్లిం ఐక్యతతో మొహరం ఉత్సవాలు.**
**- కొత్తపేట లో మొహరం ఉత్సవాల సందడి.**

**ధర్మవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని కొత్తపేట సర్కిల్లో, పోస్ట్ ఆఫీస్ సందు ఎదురుగా మొహరం ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. 17వ తేదీ నుంచి మొదలైన ఈ ఉత్సవాలు 27వ తేదీన పెద్ద సరిగెత్తుతో ముగియనున్నాయి. 25వ తేదీన చిన్న సరిగెత్తు జరుగునని కొత్తపేట కమిటీ నిర్వాహకులు, కాలేషా మస్తాన్ వలీ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. పట్టణ వ్యాప్తంగా 17 నుంచి మొదలైన పీర్లు ఆయా మఖాన్ లో కొలువు తీరాయి. కొత్తపేట సర్కిల్లో హిమామి హసేన్, హిమామి హుస్సేన్, హిమామి కాసిం, మౌలాలి, జలాలి టోపీ సాహెబ్ స్వాములు కొలువు తీరాయి. పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న కొలువులో కాలేషా మస్తాన్ వలీ, కాసిం, దూద్ పీర్, అంగార్ వలి అటుకులప్ప స్వాములు కొలువు తీరాయి.



# నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తా పోస్టర్ల విడుదల




**అనంతపురం, జూన్ 21 :అనంత జనశక్తి న్యూస్**

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనంతపురం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఏపీ వీర శైవ లింగాయత్ వెల్ఫేర్ డెవలప్మెంట్ ఛైర్మన్ స్వప్న, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొండన్న, దూదేకుల ఫెడరేషన్ డైరెక్టర్ ఇమామ్ హుస్సేన్, మార్కెట్ యార్డు ఛైర్ పర్సన్ బల్లాపల్లవి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించి, అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తా పోస్టర్లను జిల్లా కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ యోగాకు ప్రతి రోజు కొంత సమయం కేటాయించాలి.

**- యోగాంధ్రతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం వైపు అడుగులు వెయ్యాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.**
**- యోగా ఆసనాలు ఆరోగ్య వంతమైన నవసమాజ నిర్మాణానికి దోహద పడుతుంది.**
**- రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ యోగాంధ్ర-2026 శుభాకాంక్షలు.**
**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**

**నూజివీడు, జూన్ 21: అనంత జనశక్తి న్యూస్**



విజయవాడ తాడిగడప రాష్ట్ర సమాచార శాఖ మంత్రివర్యులు స్వగృహంలో ఆదివారం 12వ అంతర్జాతీయ యోగాంధ్ర2026 దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి యోగా ఆసనాలు వేశారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ యోగాంధ్రతో రాష్ట్ర ప్రజలు ఆరోగ్యం వైపు అడుగులు వెయ్యాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యోగా ఆరోగ్య వంతమైన నవసమాజ నిర్మాణానికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు, నూజివీడు నియోజకవర్గం ప్రజలకు అంతర్జాతీయ యోగాంధ్ర 2026 శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. యోగా ఒక ఆధ్యాత్మిక సాధనం అని, ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి సహాయ పడుతుందన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, యోగా అభ్యాసనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. యోగాతో శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని అందరిలో ఉన్నటువంటి ఒత్తిడిని ఆందోళనను తగ్గిస్తుందన్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేసి ఆరోగ్యమైన, ఆనందకరమైన జీవితాన్ని పొందవచ్చునని తెలిపారు. యోగాకు భారత ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా విశిష్టమైన స్థానాన్ని ఇస్తున్నారని, దీన్ని బట్టి మనం ఆలోచనలు చేసుకోవాలని అన్నారు. ఈ రోజుల్లో పిల్లలు నుండి పెద్దవారు వరకు అనేక రకములు ఒత్తిడిలకు గురి అవుతున్నారని, దీని నుండి మనం మనల్ని కాపాడుకుని, మన పిల్లలు భవిష్యత్తును ఆలోచన చేసి యోగాను ప్రతిరోజు ఆచరించాలన్నారు. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదని ఇది నిరంతరం ప్రక్రియ అని, మన ఆరోగ్యానికి మనమే అత్యంత బాధ్యత తీసుకోవాలని అన్నారు.

# 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**
**- జూన్ 22న కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ**

**అనంతపురం, జూన్ 21: అనంత జనశక్తి న్యూస్**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. అర్జీదారులు తమ ఫిర్యాదులు ఇంకా పరిష్కారం కాకపోయినా లేదా వాటి స్థితిగతులను తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అలాగే Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ అర్జీలను నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు.రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" బ్యానర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ నెల 22వ తేదీ సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)తో పాటు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో అర్జీలు సమర్పించాలని, గతంలో దాఖలు చేసిన ఫిర్యాదుల రసీదులు లేదా స్లిప్పులు వెంట తీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైన తర్వాత అర్జీదారుల మొబైల్‌కు సందేశం పంపబడుతుందని, నోటీసులు మరియు ఎండార్స్‌మెంట్‌లను వాట్సాప్‌తో పాటు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కూడా పంపుతున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే డివిజన్, మండల,ఎస్‌జీఎస్‌డబ్ల్యూ స్థాయిల్లో కూడా సోమవారం ఉదయం 9 గంటల నుంచి గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులకు సూచించారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | అనంతపురం
22.06.2026



## జెన్కో నూతన ఆర్ఐగా వి.శ్రీధర్ గౌడ్



**నాగార్జునసాగర్,జూన్ 21 అనంత జనశక్తి న్యూస్**

నాగార్జునసాగర్ జెన్కో నూతన ఆర్ఐ గా వి.శ్రీధర్ గౌడ్ ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ నాయుడు అమీన్ పూర్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీధర్ గౌడ్ నియమి తులయ్యారు.శ్రీధర్ గౌడ్ గతంలో రాష్ట్ర సచివాలయంలో ఏఆర్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నాగార్జునసాగర్ జెన్కోకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఐ శ్రీధర్ గౌడ్‌ను నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఎస్ఐ రఘు బాబు,ఏ ఎస్ఐలు పుల్లయ్య, మహమూద్ అలీలు మర్యాదపూర్వ కంగా కలిశారు,ఈ సందర్భంగా ఆయనకు సాలువతో ఘనంగా సన్మానించి,పూల బొకేలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బుద్ధవనంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**నాగార్జునసాగర్,జూన్ 21 అనంత జనశక్తి న్యూస్**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగార్జున సాగర్ లోని ప్రముఖ బౌద్ధ క్షేత్రం బుద్ధవనంలో యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు,
ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా 31వ బెటాలియన్ సుబేదార్ మేజర్ మాధవరావు,ఎన్‌సీసీ క్యాడె ట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,వీరితో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్,ఉపాధ్యా యులు,బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు,చలకుర్తి నవోదయ బాలికల పాఠశాల విద్యార్థినులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో యోగా గురువులు విద్యార్థులకు,సిబ్బందికి పలు రకాల ఆసనాలు,ప్రాణాయామం వంటి ప్రక్రియలను వేయిస్తూ తెలియజేశారు. యోగా సాధన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవి చంద్ర బుద్ధవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించడం పై హర్షం వ్యక్తం చేశారు.

## తండ్రి ఆరోగ్యం ఇంటిల్లిపాదికి శ్రీరామరక్ష



**- డా. మురళీ కృష్ణ ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**

**హైదరాబాద్ (నిజాంపేట్), జూన్ 21:అనంత జనశక్తి న్యూస్**

తండ్రి ఆరోగ్యం ఇంటిల్లిపాది కి శ్రీ రామ రక్ష,.....అలాగే ఆరోగ్యవంత జీవితం ద్వారానే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుంది అని ప్రముఖ వైద్యులు డా. మురళీ కృష్ణ అన్నారు.ఫాదర్స్ డే సం దర్భంగా హైదరాబాద్ నిజాంపేట్ రాజీవ్ గాంధీ నగర్ లోని క్రిష్ మెడ్ స్పెషాలిటీ క్లినిక్స్ లో ఉచిత వైద్య శిబిరం జరిగింది.డా, మురళీ కృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ తరచూ వైద్య పరీక్షల ద్వారానే ఆరోగ్యపరమైన, శారీరక లోపాలను గుర్తించి సరిచేసుకోగలరని అన్నారు.
తమ బిడ్డల ప్రతి అడుగులోనూ వెన్నంటి నడిచే ఆదర్శం తండ్రులదని అన్నారు. సీనియర్ జర్నలి స్ట్ నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ ప్రేమకు అమ్మ ప్రతిరూపం అయితే....బాధ్యత కు నాన్న నిలువెత్తు నిదర్శనమని అన్నారు. పిల్లల చిరునవ్వు కోసం తన జీవితాన్ని త్యాగం చేసేది నాన్న అని అన్నారు.ఈ వైద్య శిబిరం లో కంప్లీట్ బ్లడ్ కౌంట్, రాండమ్ బ్లడ్ షుగర్, HBA1C, లివర్ ఫంక్షన్ తదితర పరీక్షలు జరిగాయి. ముందుగా ఫాదర్స్ డే కేక్ కటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ మురళీ కృష్ణ సతీమణి డా. శ్వేత పద్మ, తల్లితండ్రులు శ్రీమతి అరుణ కుమారి ఎస్ సాంబశివరావు, నిమ్మరాజు కుమారుడు శ్రీవత్సవ కుమార్, ఆయా కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## ఒక్కసారిగా చెలరేగిన మంటలు

**- పూర్తిగా దగ్ధమైన ఆర్టీసీ బస్సు.!**

**- ప్రయాణికులు సేఫ్**

**కరీంనగర్, అనంత జనశక్తి న్యూస్**

కరీంనగర్ జిల్లాలో నేడు ఉదయం ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరినీ సురక్షితంగా దించేయడంతో పెను ప్రమాదం తప్పింది.
స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే బస్సులో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ ప్రశాంత్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన ఆపాడు. అనంతరం ప్రధాన ద్వారంతో పాటు ఎమర్జెన్సీ గేట్లను తెరిచి ప్రయాణికులందరినీ క్షేమంగా బయటకు పంపించాడు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

**ప్రయాణికులను సురక్షితంగా దించిన తర్వాత డ్రైవర్, సిబ్బంది బస్సులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే మంటలు ఎక్కువ కావడంతో వాటిని నియంత్రించడం సాధ్యపడలేదు. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు.**

# పంచాయతీ నిధుల గోల్ మాల్ పై చర్యలేవి..?

**- జానంపేటలో నకిలీ వెండర్స్ పేర్లతో లక్షల చెల్లింపులు.!**

**- స్పెషల్ ఆఫీసర్ వ్యవహారశైలిపై పెరుగుతున్న విమర్శలు**

**- ఆరోపణలు వస్తున్నా స్పందించని అధికార యంత్రాంగం**

**- పంచాయతీ రికార్డులపై సమగ్ర ఆడిట్‌కు డిమాండ్**

**- ప్రజాధన వినియోగంపై స్పష్టత కోరుతున్న బాధితులు..**

**- జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి**

**పినపాక, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**




పినపాక మండలంలోని గ్రామపంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ వ్యవహారశైలి పై వస్తున్న ఆరోపణలు రోజురోజుకు చర్చనీయాంశమవుతున్నా అధికార యంత్రాంగం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. సాధారణంగా ప్రజాధనానికి సంబంధించిన అంశాలపై ఆరోపణలు వెలువడిన వెంటనే ప్రాథమిక విచారణ చేపట్టడం పరిపాలనా బాధ్యత. అయితే ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. వరుసగా కథనాలు వెలువడుతున్నా, బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత శాఖలు మౌనం పాటించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ఆరోపణలు నిజమా, కాదా అన్నది విచారణ ద్వారానే తేలాలి. కానీ విచారణ ప్రారంభం కాకముందే అధికారుల మౌనం ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపే ప్రమాదం ఉంది. ఒకవేళ ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఖండిస్తూ వాస్తవాలను బయటపెట్టాల్సిన బాధ్యత కూడా అధికారులదే. అదే ఆరోపణల్లో నిజం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రక్రియలు కనిపించకపోవడం వల్లే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. గ్రామపంచాయతీలు ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే స్థానిక సంస్థలు. అలాంటి సంస్థల్లో పారదర్శకతపై సందేహాలు తలెత్తినప్పుడు ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కనిపిస్తున్న ఉదాసీన వైఖరి అవినీతి ఆరోపణల కంటే ఎక్కువగా చర్చకు దారితీస్తోంది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టు కోవాలంటే జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను వెలికితీయడం, నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచడం అత్యవసరంగా కనిపిస్తోంది. అధికారుల మౌనం కొనసాగితే అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది.

**నకిలీ వెండర్స్ పేరిట నిధుల మళ్లింపు?**

జానంపేట గ్రామపంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగమైందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామపంచాయతీకి ఎలాంటి సంబంధం లేని ఆరుగురు వెండర్స్ పేర్లపై లక్షల రూపాయలు చెక్కుల రూపంలో చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఆయా వెండర్స్ ద్వారా ఎలాంటి పనులు చేపట్టారన్న వివరాలు స్పష్టంగా లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వెండర్స్ గ్రామపంచాయతీ కార్యదర్శికి సన్నిహితులని, మరికొందరు స్పెషల్ ఆఫీసర్‌కు సంబంధించిన వ్యక్తులని స్థానికులు పేర్కొంటున్నారు. పనులు జరగకుండానే బిల్లులు రూపొందించి నిధులు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత రికార్డులు, వౌచర్లు, చెల్లింపుల వివరాలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాధన వినియోగంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, అవసరమైతే ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని వారు కోరుతున్నారు. పంచాయతీలో జరిగిన చెల్లింపులపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**జిల్లా కలెక్టర్ జోక్యం కోరుతున్న గ్రామస్తులు**

పినపాక మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.సంబంధిత రికార్డులపై సమగ్ర ఆడిట్ నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు, కూలీలకు రావలసిన బిల్లులను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులు లక్ష్యానికి అనుగుణంగా వినియోగమవుతున్నాయో లేదో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఆరోపణలకు తావులేకుండా పారదర్శక విధానాలు అమలు చేయాలని గ్రామస్తుల నుంచి విజ్ఞప్తులు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధన పరిరక్షణతో పాటు గ్రామస్థుల విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి

**హైదరాబాద్, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**



అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను "గుంపు మేస్త్రి" అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించి, ఆ భూములను ప్రభుత్వం అమ్మేసుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బస్తీవాసులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పట్టాలను కూడా రద్దు చేసి, తమ భూములను లాక్కోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయింది. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో లూటీలు జరుగుతున్నాయి.. కానీ హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. హనుమాన్ నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు.
ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు కూడా లేవని కేటీఆర్ అన్నారు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి... మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోండి... కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు.
పెద్దలకు ఒక నీతి... పేదలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మేమంతా మీకు అండగా ఉంటాం... ఎవ్వరూ భయపడకండని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు.

## విద్యుత్ ఉద్యమం తరహాలో పోరాటం

**- కలెక్టరేట్ల ముట్టడి**

**- ఇందిరాపార్కు వద్ద ధర్నా: కూనంనేని**

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలోని నిరుపేదలకు ఇళ్లు, నివాస స్థలాల హక్కులను సాధించడమే పరమావధిగా వామపక్ష పార్టీలు మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధమయ్యాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన విద్యుత్ ఉద్యమం తరహాలోనే.. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వామపక్ష నేతలు స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్‌తో కలిసి ఈ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు.
హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు, పోలీసులు అమానవీయంగా తొలగించడాన్ని వామపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఇళ్లు లేక ఆశ్రయం పొందుతున్న పేదలకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఈ నెల 27వ తేదీన హనుమకొండ నగరంలో దాదాపు 10 వేల మంది నిరుపేదలతో కలిసి భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి పేదల ఆగ్రహాన్ని రుచి చూపిస్తామని హెచ్చరించారు.
జూలై 1వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరి నుండి ఇళ్ల స్థలాల దరఖాస్తులను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. ఆ విధంగా సేకరించిన వేలాది దరఖాస్తులతో జూలై 6వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి ఈ దరఖాస్తులను నేరుగా అందజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి స్పందన, ఇచ్చే హామీల ఆధారంగానే తమ తదుపరి ఉద్యమ కార్యాచరణ ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.
గుండ్ల సింగారంలో గత నాలుగేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే.. అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని నేతలు మండిపడ్డారు. మహిళలు, చిన్న పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగి పడేశారని అడ్డు వచ్చిన యువకులు, వృద్ధుల కాళ్లు చేతులు మడిచి మరీ బలవంతంగా పోలీస్ వాహనాల్లోకి ఎక్కించి సుమారు 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అదే సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉంటే వాటిని ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. బాధిత పేదలకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని గుర్తుచేశారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని కాబట్టి వారందరికీ వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చి రక్షణ కల్పించాలని వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.**

## సైబర్ బాధితులకు ఊరట

**- 6,303 మంది బాధితులకు..**

**- రూ. 45.21 కోట్లు రిఫండ్**

**- లోక్‌అదాలత్ ద్వారా న్యాయం**

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**



ఆన్‌లైన్ కేటుగాళ్ల చేతిలో చిక్కి తీవ్రంగా నష్టపోతున్న సైబర్ నేరాల బాధితులకు తెలంగాణ పోలీసులు, న్యాయ సేవా అధికార సంస్థలు బిగ్ రిలీఫ్ ఇచ్చాయి. ప్రత్యేకంగా నిర్వహించిన లోక్‌అదాలత్ వేదికగా సైబర్ మోసాలకు గురైన బాధితులకు భారీ ఎత్తున నగదును రీఫండ్ చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6303 మంది సైబర్ మోసం బాధితులకు ఏకంగా రూ. 45.21 కోట్ల రూపాయలను విజయవంతంగా వారి ఖాతాల్లోకి రిఫండ్ చేయించారు. కోల్పోయిన సొమ్ము మళ్లీ చేతికి రావడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఈ రికవరీ ప్రక్రియలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అత్యంత కీలకపాత్ర పోషించి ముందంజలో నిలిచింది. ఒక్క సైబరాబాద్ పరిధిలోనే 2,232 మంది బాధితులకు చెందిన రూ. 21.91 కోట్లు రికవరీ చేసి వెనక్కి ఇప్పించారు. అదేవిధంగా.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నేరుగా తన పరిధిలోని 77 మంది బాధితులకు సంబంధించిన రూ. 6.83 కోట్లను రికవరీ చేసింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాల నుంచి సొమ్మును రికవరీ చేయడంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచాయి.
రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభమైన నాటి నుండి నేటివరకు అద్భుతమైన ఫలితాలను సాధించింది. ఈ బ్యూరో వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటివరకు మొత్తం 59,953 మంది బాధితులకు రూ. 445.41 కోట్ల రూపాయలను రిఫండ్ చేయించి రికార్డు సృష్టించింది. ప్రస్తుత 2026 సంవత్సరంలోనే.. జూన్ 20వ తేదీ వరకు సైబర్ మోసగాళ్ల ముఠాల నుండి రూ. 70.07 కోట్లను పోలీసులు రికవరీ చేసి ఫ్రీజ్ చేయించారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వాడుతున్న యూపీఐ మోసాలు, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, ఇంపర్సనేషన్ స్కామ్‌ల బాధితులకు పోలీసులు ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో వేగంగా న్యాయం చేకూర్చారు.
ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ప్రజలకు ఒక ముఖ్యమైన సాంకేతిక విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ లేదా సైబర్ మోసం జరిగిన వెంటనే బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 అనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి తమ ఫిర్యాదును నమోదు చేయాలని కోరారు. మోసం జరిగిన మొదటి గంటను వైద్య పరిభాషలో లాగే సైబర్ క్రైమ్‌లోనూ గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని వివరించారు. ఈ గోల్డెన్ అవర్‌లో గనుక బాధితులు అప్రమత్తమై 1930 నంబర్‌కు ఫిర్యాదు ఇస్తే.. నేరగాళ్లు ఆ సొమ్మును వేరే అకౌంట్లలోకి మార్చకముందే వారి బ్యాంక్ ఖాతాలను పోలీసులు సులభంగా ఫ్రీజ్ చేయగలుగుతారు. దీనివల్ల బాధితులకు తమ డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు అత్యధికంగా ఉంటాయని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు.

# గ్రామ గ్రామాన... యోగా మందిరాలు






- ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం
- టెక్నాలజీకి ఆధ్యాత్మికను అనుసంధానిస్తే అన్‌స్టాపబుల్
- ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని అమలు
- భారత శక్తిని ప్రపంచానికి చాటుతున్న ప్రధాని సేవలు శ్లాఘనీయం
- తిరుపతిలో యోగాంధ్ర-2027
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ యోగాసనాలు
- వివిధ క్లిష్టమైన ఆసనాలను సునాయాసంగా వేసిన సీఎం
- సమాజ హితం కోసం బాధ్యతతో వ్యవహరిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన ముఖ్యమంత్రి



***అమరావతి, జూన్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో యోగా మందిరాలను నిర్మిస్తామని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆదివారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సీఎం చంద్రబాబు యోగాంధ్ర లోగో ఉన్న చొక్కా ధరించి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో ప్రముఖ యోగా గురు రామ్ దేవ్ బాబా వివిధ ఆసనాలు వేయించారు. ప్రాణాయామం, అనులోమ, విలోమ పద్దతుల్లో సీఎం చంద్రబాబు యోగాభ్యాసం చేశారు. అలాగే యోగాభ్యాసంలో భాగంగా వివిధ ఆసనాలను సీఎం చంద్రబాబు సునాయాసంగా వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐజీఎం స్టేడియం విద్యార్థి, యువతీ, యువకులతో నిండిపోయింది.

వివిధ స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. ఉదయం ఐదు గంటల నుంచి రామ్ దేవ్ బాబా ప్రజలతో యోగ సాధన చేయించారు. సమాజహితం కోసం బాధ్యతతో వ్యవహరిస్తామని ప్రజలతో సీఎం చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రశాంత వాతావరణంలో యోగా గురువు రామ్ దేవ్ బాబాతో కలిసి యోగాభ్యాసం చేయడం ఎన్నటికీ మరువలేం. యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ప్రధాని మోదీ ప్రపంచానికి భారతదేశ శక్తిని చాటుతున్నారు...


దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నారు. ప్రధాని చొరవతో 190 దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచానికి భారత్ విశ్వగురు... ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగలిగేది భారతదేశం. ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ పెంచేది యోగానే. యోగాను ప్రజలకు దగ్గర చేసిన రామ్ దేవ్ బాబా కృషి అమోఘం. సాంకేతికత.. ఆధ్యాత్మికత కాంబినేషన్ తో వెళ్తేనే భవిష్యత్. ఆధ్యాత్మికత, యోగా సాధనతో హెల్తీ, వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్ సాధించేందుకు కృషి చేద్దాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**యోగా కోసం ప్రత్యేక పోర్టల్**

"యోగాంధ్ర2025లో విశాఖలో నిర్వహించి రికార్డులు సృష్టించాం. ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ రికార్డులు, ప్రపంచ రికార్డులు సాధించాం. వచ్చే ఏడాది తిరుపతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తాం. 1.33 లక్షల సెంటర్లల్లో కోటి మందికి పైగా యోగా సాధన చేస్తున్నారు. ఇంటింటికి యోగా చేరాలి... ప్రజారోగ్యం బాగుండాలి.. ఇదే ప్రభుత్వ లక్ష్యం. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలు నిర్మిస్తాం. యోగా కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తాం. స్టాండర్డ్ యోగా ప్రోటోకాల్స్ రూపొందించేందుకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తాం. యోగాంధ్ర కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేస్తాం. జంక్ ఫుడ్ వద్దు.. ఫాస్ట్ ఫుడ్‌ను దూరంగా పెడదాం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం... రసాయన రహిత ఆహారాన్ని స్వీకరిస్తే అనారోగ్యం దరి చేరదు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతాం. సంజీవని ప్రాజెక్టును ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం. వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేస్తాం... సంజీవనిలో యోగాను చేరుస్తాం. రోజుకో గంట యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయాలి.. ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరమే రాదు. నేను 30 ఏళ్ల నుంచి యోగా అభ్యాసం చేస్తాను. ప్రతి రోజూ బిజీగా ఉంటాను.. రకరకాల సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుంది. కానీ యోగాసాధన చేయడం వల్ల అన్ని ఇబ్బందులను అధిగమించగలుగుతున్నాను

. టెక్నాలజీకి ఆధ్యాత్మికతత తోడైతే అన్ స్టాపబుల్. నేటి తరం టెక్నాలజీని అడాప్ట్ చేసుకున్నట్టే... యోగాను.. ఆధ్యాత్మికతను అడాప్ట్ చేసుకోవాలి."అని సీఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 1.07 కోట్లమంది పౌరులు, 2.5 లక్షల





మంది శిక్షకులు యోగాలో పాల్గొన్నందుకు రెండు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కాయి...వాటిని అధికారులు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, శ్రీనివాస వర్మ, యోగానేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణరాజు, మంత్రి సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, సవిత పాల్గొన్నారు.







# విస్తృతంగా వాహనాల తనిఖీలు



- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన పోలీసులు....

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరియు ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, వేగంగా డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.

అలాగే, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతకు తోడ్పడాలని పోలీసు అధికారులు కోరారు.

# ఘనంగా యోగా డే కార్యక్రమం



**నల్లచెరువు జూన్ 21 అనంత జనశక్తి న్యూస్**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు యోగ కార్యక్రమాన్ని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి మరియు తహసిల్దార్ రవి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి వివిధ మండల స్థాయి అధికారులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు ప్రజా ప్రతినిధులు విద్యార్థినీ విద్యార్థులు పత్రిక విలేకరులు అందరూ హాజరై యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా మహాసభ





**ధర్మవరం జూన్ 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలో సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పార్టీ ఆధ్వర్యంలో తొలి అనంతపూర్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ సందర్భంగా పార్టీ ఆంధ్రప్రదేశ్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మన్నవ హరి ప్రసాద్, కామ్రేడ్ భీమవరం సుబ్బారావు సమక్షంలో అనంతపూర్ జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మహాసభ అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మన్నవ హరి ప్రసాద్, భీమవరం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కార్మికుల హక్కుల హరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అంశాల్లో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో వెనుకబడిందని, యువతకు ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, పేదలకు సంక్షేమ పథకాలు, మహిళల అభివృద్ధి వంటి అంశాల్లో స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక రంగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. అనంతపూర్ జిల్లాలో సాగునీరు, ఉపాధి, వ్యవసాయ సంక్షోభం, కరువు పరిస్థితులు, పరిశ్రమల లేమి వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# శాశ్వత స్థలాలు కేటాయిస్తే మరింత ఉపాధి

- సోమందేపల్లిలో గణేష్ విగ్రహాల తయారీదారుల విజ్ఞప్తి...

**ధర్మవరం జూన్ 21 అనంత జనశక్తి న్యూస్ :**



శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో గణేష్ విగ్రహాల తయారీ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని విగ్రహాల తయారీదారులు తెలిపారు. గతంలో గణేష్ విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకునేవారమని, అయితే ఈసారి స్థానికంగానే తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విగ్రహాల తయారీ ప్రారంభించామని పేర్కొన్నారు. దాతల సహకారంతో ప్రస్తుతం ఐదుగురు కార్మికులు ఈ కేంద్రంలో గణేష్ విగ్రహాలను రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం శాశ్వతంగా స్థలాలు కేటాయిస్తే విగ్రహాల తయారీకి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైన స్థలం, ప్రోత్సాహం అందిస్తే స్థానిక కళాకారుల ప్రతిభకు గుర్తింపు రావడంతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి మార్గాలు విస్తరించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.



# పీహెచ్‌డీ కావాలి

**గుంటూరు, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

గుంటూరు జిల్లాలో రాజకీయం చేయాలంటే పీహెచ్‌డీ కావాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజకీయం పుట్టింది గుంటూరులో అంటారని, మరొక 30 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేలా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. బ్రిటీష్ పాలనలో ఎలాంటి అంధకారం ఉందో అటువంటి అంధకారమే జగన్ పాలనలో ఉందని అన్నారు. దేశంలో ఏపీలో మాత్రమే భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆదివారం ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..'రెండేళ్లలో ఏం చేశామో పుస్తకం వేసి మరీ చర్చకు రమ్మంటున్నాం. గొడ్డలి పార్టీ పాలనలో పల్నాడులో ప్రతి రోజు ఏదో ఒక వార్త వినాల్సి వచ్చేది. జగన్ ఎన్నో తప్పుడు బటన్లు నొక్కాడు. చంద్రబాబును అరెస్ట్ చేసి.. గొడ్డలి పార్టీ భూస్థాపితం అయ్యే తప్పుడు బటన్ కూడా నొక్కాడు. భాష్యం ప్రవీణ్‌కు టీడీపీలో ఉజ్వలమైన భవిష్యత్ ఉంది. మీ ఉత్సాహం చూస్తుంటే నాకు పూనకం వస్తుంది'.. 'ఎన్నికల సభ కంటే ఉత్సాహంగా రెండేళ్ల విజయోత్సవ సభ జరిగింది. ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు గురించి అవాకులు చవాకులు పేలుతున్నారు. కృష్ణ కాదు కృష్ణ దేవరాయలు అని గుర్తుపెట్టుకోండి. ఆయన వ్యక్తిత్వం మాకు తెలుసు. ప్రజా సమస్యల గురించి నిత్యం మాట్లాడుతుంటారు' అని అన్నారు.

# ప్రపంచానికి యోగా ఓ వరం

**అమరావతి, జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

ప్రపంచానికి యోగా ఒక వరం లాంటిదని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అభివర్ణించారు. ఆదివారం యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీవనశైలిలో యోగా ఒక భాగం కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకున్నామని వివరించారు. ప్రతి మనిషికి దినచర్యలో యోగా ఓ భాగం కావాలని ఆకాంక్షించారు. గ్రామ, మండల స్థాయిలో యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ యోగా కార్యక్రమాల్లో అధికారులతోపాటు ప్రజలు పాల్గొంటున్నారని మంత్రి అనిత తెలిపారు. నేడు చిన్న చిన్న పిల్లలు కూడా ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా జీవించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతేడాది విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ యోగాసనాలు వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొన్నారని హోం మంత్రి అనిత వివరించారు.

ప్రపంచానికి యోగా పరిచయం చేసిన భారత్: పల్లా

ప్రపంచానికి యోగాను భారత్ పరిచయం చేసిందని టీడీపీ ఏపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీవనశైలిలో యోగా భాగం కావాలన్నారు. యోగాను సీఎం చంద్రబాబు గ్రామీణ స్థాయిలోకి తీసుకెళ్తున్నారని వివరించారు.

వర్షం కారణంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చాం: జిల్లా కలెక్టర్

గత నెల రోజులుగా విశాఖపట్నం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. డిఫెన్స్ అండ్ ఎక్స్ సర్వీస్‌మెన్ థీమ్‌తో నేవీ సహకారంతో ఈ యోగా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, జిల్లా ప్రజా ప్రతినిధులతోపాటు పాలనా యంత్రాంగం భాగస్వామ్యం అయిందని అన్నారు. ఇందులో నేవీ, స్టీల్ ప్లాంట్, ఏయూతోపాటు పలు సంస్థలు ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నాయని వివరించారు.

రుషి కొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వంటి పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించాల్సిన ప్రధాన కార్యక్రమాన్ని వర్షం కారణంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చామని జిల్లా కలెక్టర్ అభిషిక్త కిశోర్ చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. యోగాను ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప సంపద అని అభివర్ణించారు. యోగా ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ పొందాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని పేర్కొన్నారు. యోగా ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని, మరింత మందికి చేరవేయాల్సి బాధ్యత ఉందని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ చెప్పారు.

## నాన్న చూపిన మార్గమే
# నాకు స్ఫూర్తి

### ఫాదర్స్ డే వేళ జగన్ ఎమోషనల్ పోస్ట్

**అమరావతి, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

ఫాదర్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని స్మరించుకుంటూ ఎంతో భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని, ఆయన ద్వారా తాను నేర్చుకున్న జీవిత పాఠాలను వైఎస్ జగన్ ఈ ట్వీట్‌లో ఎంతో ఆత్మీయంగా గుర్తుచేసుకున్నారు.

"నా జీవితంలో నేను చూసిన గొప్ప నాయకుడు, అత్యంత మంచి మనిషి మా నాన్న వైయస్ఆర్. ప్రజల పట్ల ఎల్లప్పుడూ నిరంతర ప్రేమతో ఉండాలి, ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా సేవ చేయాలి, నమ్మి వచ్చిన వారికి ఇచ్చిన మాటను ప్రాణ సమానంగా నిలబెట్టుకోవాలి.. జీవితంలో ఎన్ని కష్టాలు, సవాళ్లు ఎదురైనా సరే ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలి.. ఇవన్నీ నాన్న నా చేతులు పట్టి నాకు నేర్పిన జీవిత పాఠాలు" అని వైఎస్ జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. తన తండ్రి ఆశయాలే తనను నడిపిస్తున్నాయని చెప్తూ.. ఆయన చూపిన మార్గం, తనకు చిన్నతనం నుంచి నేర్పిన విలువలు ప్రతిరోజూ తనకు స్ఫూర్తినిస్తున్నాయన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే శక్తిని ఇస్తున్నాయని.. ఈ ఫాదర్స్ డే సందర్భంగా నాన్నను మనస్ఫూర్తిగా స్మరించుకుంటూ.. అందరికీ హ్యాపీ ఫాదర్స్ డే అంటూ వైఎస్ జగన్ రాసుకొచ్చారు.



# వైసీపీ కాపు నేతలది 'ఆత్మీయ సమావేశం' కాదు... ఓటమి భయంతో చేసుకుంటున్న 'ఆత్మావలోకనం'

- :మంత్రి కందుల దుర్గేష్
- ఆత్మీయ సమావేశాల పేరుతో వైసీపీ కాపు నేతల వ్యవహార శైలిపై నిప్పులు చెరిగిన మంత్రి కందుల దుర్గేష్.
- పిఠాపురంలో పర్మినెంట్ అడ్రస్ గల్లంతయ్యేసరికే వంగా గీతకు ఫ్రస్ట్రేషన్
- పదవులు పోయాక, ప్రజలు ఛీత్కరించుకున్నాక ఏ ముఖం పెట్టుకుని ఈ హడావిడి చేస్తున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం కాపు సమాజాన్ని వాడుకోవాలని చూస్తే... తస్మాత్ జాగ్రత్త: మంత్రి దుర్గేష్
- జగన్ మోహన్ రెడ్డికి దమ్ముంటే పులివెందుల కోట దాటి వేరే నియోజకవర్గంలో పోటీ చేయగలడా?: మంత్రి దుర్గేష్*
- సామాన్య కార్యకర్త కొట్టె సాయికి అందలం ఎక్కించిన చరిత్ర జనసేనాని పవన్ కళ్యాణ్ ది: మంత్రి దుర్గేష్
- 'దేశం, సమాజం బాగుండాలి... నన్ను కులాల చట్రంలో బంధించవద్దు' అని జనసేనాని పవన్ కళ్యాణ్ చెప్పిన ఉన్నతమైన మాటలను తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ నేతలు



**విక్రృతంగా చిత్రీకరిస్తున్నారు: మంత్రి దుర్గేష్**

**రాజమహేంద్రవరం జూన్ 21, అనంత జనశక్తి న్యూస్**

వైసీపీ కాపు నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం ఒక ఆత్మీయ సమావేశం కాదని, అది జగన్ రెడ్డి ఐదేళ్ల తుగ్లక్ పాలనలో కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, సమాజానికి ద్రోహం చేశాక... "రేపు మనకు పుట్టగతులు ఉంటాయా, మన రాజకీయ భవిష్యత్తు ఏంటి" అని భయంతో ఏడుస్తూ చేసుకుంటున్న "ఆత్మావలోకన" సమావేశం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దుర్గేష్ వైసీపీ నేతల కపట నాటకాలను తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పిఠాపురంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన దుర్దశ, ఫ్రస్ట్రేషన్ భరించలేకే వంగా గీత ఇవాళ కూటమి ప్రభుత్వంపై, మా నాయకుడు పవన్ కళ్యాణ్ పై విషం చిమ్ముతున్నారు. పిఠాపురంలో ఆమె పర్మినెంట్ అడ్రస్ గల్లంతైందనే బాధే ఆవిడ మాటల్లో కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎక్కడినుండైనా పోటీ చేసే హక్కు, స్వేచ్ఛ జనసేనాని పవన్ కళ్యాణ్‌కు ఉన్నాయి. పిఠాపురం శ్రీపాద వల్లభుడిపై ఉన్న భక్తితో, ఆ ప్రాంతాన్ని వందల కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతోనే ఆయన అక్కడ పోటీ చేసి చారిత్రాత్మక విజయం సాధించారు. మరి మీ జగన్ రెడ్డికి అంత దమ్ముంటే... కేవలం పులివెందుల కోటకే ఎందుకు పరిమితమయ్యాడు? వేరే నియోజకవర్గం నుండి పోటీ చేసే సాహసం ఎందుకు చేయలేకపోయాడో వైసీపీ కాపు నేతలు సమాధానం చెప్పాలి అని నిలదీశారు. గతంలో టీడీపీజనసేన హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్యకు ఇతోధికంగా నిధులు ఇచ్చి ఎంతోమంది యువతను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దింది నిజం కాదా? అని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. మరి గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ కార్పొరేషన్‌ను ఎందుకు నిర్వీర్యం చేశారు? నిధులు ఆపేసి, కాపు కళ్యాణ మండపాల నిర్మాణాలను నిలిపివేసి, విదేశీ చదువులకు వెళ్లిన విద్యార్థులను నడిరోడ్డుపై పడేసి నానా అవస్థలు పెట్టినందుకు వైసీపీ నేతలు కాపు సమాజానికి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి. నాడు కాపు యువత భవిష్యత్తును నడిసముద్రంలో ముంచేసిన మీకు... నేడు కులాల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అంటూ ఫైర్ అయ్యారు. విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఉంది కాబట్టే, ఆ కుటుంబం ప్రభుత్వాన్ని సంప్రదించి నమ్మకం వ్యక్తం చేసిందన్నారు. మాకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విచారణ జరిపిస్తూ సీఐని సస్పెండ్ చేశాం. తూర్పుగోదావరి ఎస్పీని స్పెషల్ ఆఫీసర్‌గా పెట్టి ఎంక్వైరీ చేయిస్తున్నాం. చట్టం ముందు ఎవరైనా ఒకటే... తప్పు చేసిన వాడు ఎంతటివాడైనా సరే చట్టం నుండి తప్పించుకోలేడని స్పష్టం చేశారు. నాడు శ్రీకాళహస్తిలో కొట్టె సాయిపై వైసీపీ అరాచక శక్తులు దాడులు చేస్తే, ఈ రోజు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న ఏ ఒక్క వైసీపీ కాపు నేత అయినా కనీసం పరామర్శకు వెళ్లారా? అని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. ఆ రోజు రక్షకుడిగా నిలబడింది ఒక్క పవన్ కళ్యాణ్ మాత్రమే! తిరుపతి వెళ్లి జిల్లా ఎస్పీతో మాట్లాడి, సాయికి ధైర్యం చెప్పడమే కాకుండా... ఇవాళ అధికారంలోకి రాగానే ఆ సామాన్య కార్యకర్త అయిన కొట్టె సాయిని శ్రీకాళహస్తి టెంపుల్ చైర్మన్‌గా నియమించి అందలం ఎక్కించారు. అది సాయి ఒక్కడికే కాదు యావత్ జనసేన శ్రేణులకి మా అధ్యక్షుడు ఇచ్చిన ధైర్యం. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏనాడైనా ఒక సామాన్య కార్యకర్తకు ఈ స్థాయి పదవి ఇచ్చి గౌరవించాడా? వైసీపీ అంటే కార్యకర్తలను వాడుకుని వదిలేసే రకం... జనసేన అంటే నాడు గాయపడ్డ కార్యకర్తను గుండెలకు హత్తుకుని పదవులిచ్చే నైతిక చరిత్ర అని పేర్కొన్నారు. 'దేశం, సమాజం బాగుండాలి... నన్ను కులాల చట్రంలో బంధించవద్దు' అని ఢిల్లీలో పవన్ కళ్యాణ్ చెప్పిన ఉన్నతమైన మాటలను తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ నేతలు విక్రృతంగా చిత్రీకరిస్తున్నారు. దేశం, సమాజం బాగుండాలనుకునే నాయకుడిని కులాల చట్రంలో బంధించాలని చూస్తే... ఆ చట్రాన్ని బద్దలు కొట్టే మొదటి దెబ్బ కాపు యువతే వేస్తుంది, గుర్తుపెట్టుకోండి! అని సవాల్ విసిరారు. అధికార ముసుగు ముఖాన వేసుకుని, ఐదేళ్లపాటు గద్దెపై కూర్చుని... సొంత కాపు కులానికి అన్యాయం జరుగుతుంటే కళ్లప్పగించి చూసిన చేతకాని వ్యక్తులు మీరు! అని వైసీపీ కాపు నేతలను సూటిగా నిలదీశారు. నాడు మీ జగన్ రెడ్డి కాపు కార్పొరేషన్‌ను ఖూనీ చేస్తుంటే నోళ్లు కుట్టేసుకుని పడి ఉన్న మీరు... ఇవాళ పదవులు పోయాక, ప్రజలు ఛీత్కరించుకున్నాక ఏ ముఖం పెట్టుకుని ఈ హడావిడి చేస్తున్నారు? మీ స్వార్థ రాజకీయాల కోసం కాపు సమాజాన్ని వాడుకోవాలని చూస్తే...ఈసారి కాపు యువత తోలు వలిచి చేతిలో పెడుతుంది, జాగ్రత్త అని మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

# రాహుల్‌ను కలవాలి

### రేవంత్ ద్వారా అపాయింట్‌మెంట్ కోరిన రాంచందర్ రావు సీఎంకు బహిరంగ లేఖ

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి .. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఈరోజు (ఆదివారం) బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై వినతిపత్రం సమర్పించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం స్పందించడంలో, అపాయింట్‌మెంట్ కల్పించడంలో విఫలమైతే, అది కాంగ్రెస్ తెలంగాణకు, ఇక్కడి ప్రజలకు చేసిన తీవ్ర ద్రోహమని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు, గ్యారంటీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతునప్పటికీ మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, వ్యవసాయ



కార్మికులు, పేద కుటుంబాలకు ఇచ్చిన పలు కీలక హామీలని ఇంకా ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు.

**పేద కుటుంబాలకు నిరాశే..**

మహిళలు నెలకు రూ.2,500 అందుతుందని ఆశించిన ఆర్థిక సహాయం కోసం ఇంకా ఎదురుచూస్తున్నారని రాంచందర్ రావు చెప్పుకొచ్చారు. అలాగే రైతుభరోసా కింద ఎకరాకు రూ.15,000 వస్తుందని అన్నదాతలు ఇంకా వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులు, రైతు కూలీలు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూడా నిరాశే ఎదురవుతోందని తెలిపారు. విద్యార్థులు, యువత పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, విద్యాభరోసా పథకం కింద ఇస్తామన్న రూ.5 లక్షల సహాయం ఇంకా ఎందుకు కార్యరూపం దాల్చలేదని నిలదీశారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాహుల్ గాంధీ పదేపదే నిరుద్యోగులకు హామీ ఇచ్చిన నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి కోసం ఇంకా ఎదురుచూస్తున్నారని తెలిపారు.

**వీలైనంత త్వరగా నాకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలి..**

అంతేకాకుండా, వృద్ధులు నెలకు రూ.4,000 పెన్షన్ కోసం ఇంకా వేచి చూస్తున్నారని రాంచందర్ రావు అన్నారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆర్థిక సహాయాన్ని పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, అది ఇప్పటికీ అమల్లోకి ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు కూడా తమకు ఇస్తామన్న ఉచిత స్కూటర్ల కోసం ఇంకా వేచి చూస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ పెరుగుతోందని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆందోళనలను, సమస్యలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలైనంత త్వరగా తనకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు రాంచందర్ రావు.

## రైతులపై చంద్రబాబు
# ప్రేమ బూటకం



**అమరావతి, జూన్ 21, అనంతజనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతులపై ఉన్న ప్రేమ కేవలం బూటకమని, ఆయన పాలనలో రైతులకు మోసం, బకాయిల భారం, నిరాశ మాత్రమే మిగిలాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా 143 హామీలలో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదని ఆయన సోషల్ మీడియా వేదికగా (ఎక్స్) విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వ హయాంలో (201924) కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా 53.58 లక్షల రైతు కుటుంబాలకు నిరంతరంగా 'రైతు భరోసా' అందించామని, మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువగానే రైతులకు మేలు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రైతు భరోసా నిధుల కోత.. లబ్ధిదారుల తొలగింపు

పీఎం కిసాన్ పథకానికి అదనంగా ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు తన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని జగన్ ఆరోపించారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో అదనపు సాయం కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అలాగే 202526లో రూ.20 వేలకు బదులు కేవలం రూ.14 వేలు మాత్రమే ఇచ్చారని, ఇక 202627లో రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5 వేలకే పరిమితం చేశారని మండిపడ్డారు. ఈ విధంగా మూడు సంవత్సరాలలో ప్రతి రైతుకు రూ.60 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.19 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. దీనికి తోడు రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యను 53.58 లక్షల నుండి 46.85 లక్షలకు తగ్గించి, సుమారు 7 లక్షల మంది రైతులను పథకం నుండి అన్యాయంగా తొలగించారని, ముఖ్యంగా కౌలు రైతులు, పట్టాలున్న గిరిజన రైతులకు తీవ్ర అన్యాయం చేశారని జగన్ పేర్కొన్నారు.

ధరల స్థిరీకరణ నిధి నిర్లక్ష్యం.. బీమా రద్దు

రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర కల్పించలేదని, ధరల స్థిరీకరణ నిధిని ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వైఎస్ జగన్ విమర్శించారు. తమ గత ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ కోసం రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. వరి నుండి మామిడి వరకు పలు పంటల ధరలు దారుణంగా పడిపోయినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతులకు ఎంతో మేలు చేసే ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసి రైతులపై అదనపు భారం మోపారని, ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియం కూడా చెల్లించకుండా ఎగ్గొట్టారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా కోసం రూ.7,802 కోట్లు చెల్లించామని జగన్ స్పష్టం చేశారు.

రైతు సంక్షేమ వ్యవస్థల నిర్వీర్యం

మొంథా తుపాను వల్ల సర్వస్వం కోల్పోయిన బాధిత రైతులకు ఇప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడే సున్నా వడ్డీ రుణాల పథకాన్ని కూడా ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్బీకేలు (RBK), ఈక్రాప్ (eCrop), , టెస్టింగ్ ల్యాబ్ వ్యవస్థలను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా బలహీనపరిచిందని ఆరోపించారు.

ఆక్వా, మామిడి, పొగాకు రైతుల ఇబ్బందులు

ఆక్వా రంగంపై ప్రభుత్వం తీవ్రమైన భారం మోపిందని, మేత (ఫీడ్) ధరలు విపరీతంగా పెరిగిపోయి, రొయ్యల ధరలు పడిపోవడంతో ఆక్వా రైతులు భారీగా నష్టపోయారని జగన్ పేర్కొన్నారు. రైతుల నుండి ఒత్తిడి వచ్చిన తర్వాత కూడా ఫీడ్ ధరలను కిలోకు కేవలం రూ.2 మాత్రమే తగ్గించారని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా ఆక్వా రైతులకు ఇచ్చే కరెంటు సబ్సిడీని కూడా ఎగ్గొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మామిడి రైతులకు గతంలో ప్రకటించిన రూ.380 కోట్ల సాయాన్ని ఇప్పటికీ చెల్లించలేదని, ఈ ఏడాది కూడా వారిని మళ్లీ మోసం చేస్తున్నారని విమర్శించారు. అలాగే పొగాకు ధరలు పూర్తిగా కుప్పకూలినా ప్రభుత్వం వైపు నుండి ఎలాంటి స్పందన లేదని, రైతాంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని వైఎస్ జగన్ విమర్శించారు.

# నీరజ్ సత్తాచాటేనా?

దోహా: దాదాపు తొమ్మిది నెలల తర్వాత భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా పునరాగమనం చేయబోతున్నాడు. శుక్రవారం జరగనున్న దోహా డైమండ్ లీగ్‌లో అతడు బరిలో దిగబోతున్నాడు. ఈ రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత.. గత ఏడాది సెప్టెంబరులో టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో వెన్నుగాయానికి గురయ్యాడు. కోలుకుంటూనే కొన్ని రోజులు స్విట్జర్లాండ్‌లో ప్రత్యేక శిక్షణ పొందాడు. అయితే సుదీర్ఘ విరామం తర్వాత జావెలిన్ పట్టుకోబోతున్న అతడికి.. ఈనెల ఆరంభంలో రోమ్ డైమండ్ లీగ్‌లో (92.62 మీటర్లు) సత్తాచాటిన శ్రీలంక ఆటగాడు రుమేశ్ తరంగ పతిరగె నుంచి గట్టిపోటీ ఎదురుకావచ్చు. నిరుడు దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ 90.23 మీటర్లు విసిరి.. ఈ మార్కు అందుకున్న తొలి భారత అథ్లెట్‌గా నిలిచాడు. మరి పునరాగమనంలో అతడు ఏం చేస్తాడో చూడాలి.

**చివరిది కాబట్టి గాయంతోనే..:** పునరాగమనం సందర్భంగా నీరజ్ మాట్లాడుతూ.. "2025 టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌నకు ముందే నాకు వెన్ను గాయమైంది. అయినా నిరుడు అదే చివరి పోటీ కావడంతో గాయంతోనే బరిలో దిగాను. అది సరైన నిర్ణయం కాదని తర్వాత అర్థమైంది. ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా ఉన్నా" అని పేర్కొన్నాడు.




# అఫ్గాన్‌తో మూడో వన్డేకు హర్షిత్ రాణా.. ఇప్పుడెందుకంటే?



మోకాలి గాయం కారణంగా ఐపీఎల్ 2026 సీజన్ నుంచి వైదొలిగిన హర్షిత్ రాణా కోలుకున్నాడు. అఫ్గానిస్థాన్‌తో మూడో వన్డే కోసం స్క్వాడ్‌లోకి హర్షిత్ రాణాను టీమ్‌ఇండియా తీసుకుంది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను 2-0 తేడాతో భారత్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హర్షిత్ రాణాను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారింది. దాదాపు రెండు నెలలపాటు అతడు ఆటకు దూరంగా ఉన్నాడు.

**ప్రాక్టీస్ కోసం..**

అఫ్గానిస్థాన్‌తో మూడో వన్డేను భారత్ చెపాక్ వేదికగా శనివారం ఆడనుంది. ఈ మ్యాచ్‌లో హర్షిత్ రాణాను మేనేజ్‌మెంట్ ఆడించడం ఖాయమే. ఇది ముగిసిన తర్వాత నేరుగా టీమ్‌ఇండియా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లను ఆడేందుకు వెళ్లనుంది. ఈ రెండు సిరీస్‌లకు హర్షిత్ రాణా ఎంపికైన సంగతి తెలిసిందే. దీంతో అతడికి మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. అందుకే, సిరీస్ ఫలితంతో సంబంధం లేని అఫ్గాన్‌తో మూడో వన్డే బరిలోకి దిగనున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ క్రికెట్‌కు అలవాటు పడేందుకు ఇది ఉపయోగపడనుంది.

**సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా..**

ప్రస్తుతం భారత్ జట్టుకు హార్దిక్ పాండ్య, నితీశ్‌కుమార్ రెడ్డి పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లుగా ఉన్నారు. ఇందులో హార్దిక్ అన్ని ఫార్మాట్లలోనూ ఆడటం లేదు. నితీశ్ మాత్రం ఇప్పుడిప్పుడే ఎదుగుతూ ఉన్నాడు. ఈ క్రమంలో నితీశ్‌కు తోడుగా మరొక పేస్ -బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాల్సిన అవసరం భారత్ ముందుంది. అందులోభాగంగానే హర్షిత్ రాణాకు ఎక్కువగా అవకాశాలు వస్తున్నాయి. ఆఖర్లో బ్యాటింగ్ చేయగలనని రాణా కూడా ఇప్పటికే నిరూపించుకొన్నాడు. అయితే, అతడికి గాయాలు కావడం ఆందోళనకరంగా మారుతోంది.

# వైభవ్ సూర్యవంశీ రాణిస్తే టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ కళ: క్రిష్ శ్రీకాంత్



ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్. ఐపీఎల్‌లో అదరగొట్టడంతో టీమ్‌ఇండియాకు ఎంపికయ్యాడు. దీంతో అతడిపై అభిమానులకు భారీ అంచనాలే ఏర్పడ్డాయి. ప్రస్తుతం వైభవ్ ఇండియా A జట్టు తరఫున ఆడుతూ శ్రీలంకలో ఉన్నాడు. ముక్కోణపు సిరీస్ ముగిశాక.. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఉంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తోనూ పొట్టి ఫార్మాట్‌లో ఐదు మ్యాచులను భారత్ ఆడనుంది. అయితే, అతడిని మరీ ఎక్కువగా విశ్లేషిస్తూ ఒత్తిడికి గురిచేయొద్దని టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ క్రీడా పండితులు, అభిమానులకు సూచించాడు. వైభవ్ ఇలానే టెస్టుల్లోనూ రాణిస్తే.. సుదీర్ఘ ఫార్మాట్‌కు మళ్లీ కళ వస్తుందని అభిప్రాయపడ్డాడు.

"పరుగులు సాధించాలని అనుకోవడంతోపాటు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలనే బలమైన ఆకాంక్ష ఉండటమే వైభవ్ సూర్యవంశీలో నాకు నచ్చే అంశం. క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడగల సామర్థ్యం కూడా అతడి సొంతం. టీ20 క్రికెట్ నుంచి వన్డేలకు.. ఆ తర్వాత టెస్టుల్లో వృద్ధి చెందితే మాత్రం సుదీర్ఘ ఫార్మాట్‌కు అద్భుతమైన కళ తీసుకురాగలడు. టెస్టు క్రికెట్ పునరుజ్జీవనంలో ఇలాంటి కుర్రాళ్లదే కీలక పాత్ర. వైభవ్ సూర్యవంశీ ఆటను చూసేందుకు అభిమానులు టీవీ ఆన్ చేస్తున్నారు. ఫ్యాన్స్‌ను ఆకర్షించే సత్తా అతడికి సహజంగానే వచ్చింది. అయితే, వైభవ్ గురించి మరీ ఎక్కువగా విశ్లేషణలు చేసి.. అనవసర ఒత్తిడికి గురి చేయొద్దు. అతడు సహజసిద్ధమైన గేమ్‌ను ఆడేలా చూడాలి. ఒక్క సిరీస్‌లో ఏదైనా సరిగ్గా ఆడలేకపోతే వెంటనే సదరు ప్లేయర్‌ను జడ్జ్ చేయొద్దు. కాస్త సమయం ఇవ్వాలి. తొలిసారి ఆడిన ఐపీఎల్‌లోనే అదరగొట్టాడు. ఇక ఇటీవల సీజన్‌లో చాలా అవార్డులను సొంతం చేసుకున్నాడు" అని క్రిష్ తెలిపాడు.

**జట్టుతో ఉంటే చాలు..**

"ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం రాకపోయినా ఫర్వాలేదు. రిజర్వ్ బెంచ్‌లో ఉండనివ్వండి. అతడికి అంతర్జాతీయ క్రికెట్ ఎలా ఉంటుందో అర్థం చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది. సంజు శాంసన్ - అభిషేక్ శర్మ ఓపెనర్లుగా వస్తే వైభవ్‌కు ప్లేస్ దొరకడం కష్టమే అవుతుంది. అంతకుముందు ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ను భారత్ ఆడనుంది. ప్రత్యర్థి చిన్న జట్టైనా.. పెద్ద జట్టైనా సరే వైభవ్‌ను మాత్రం స్వేచ్ఛగా ఆడేలా చూడాల్సిన బాధ్యత టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌పై ఉంది. ఇక్కడ సచిన్, వైభవ్‌ను పోల్చడం సరికాదు. సచిన్ గాడ్ ఆఫ్ క్రికెట్. ఈ కుర్రాడు సన్ ఆఫ్ గాడ్. సచిన్‌ను అలా వదిలేయండి.. అతడికి చేరువగా ఎవరూ రాలేరు. వైభవ్ తీరు భిన్నమైంది. తొలి బంతినే సిక్స్‌గా మలచాలని వైభవ్ అనుకుంటాడు. భలేగుంటుంది" అని శ్రీకాంత్ వెల్లడించాడు.

# కార్ల్‌సన్‌కు అర్జున్ షాక్

హాంకాంగ్: ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు భారత గ్రాండ్‌మాస్టర్ల చేతిలో పరాభవాలు కొనసాగుతున్నాయి. ఇటీవలే నార్వే చెస్ టోర్నీలో ప్రజ్ఞానంద చేతిలో రెండుసార్లు ఓడిన ఈ దిగ్గజ క్రీడాకారుడు.. తాజాగా ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో అర్జున్ ఇరిగేశికి తలొంచాడు. ఏంజీడీ1కు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్జున్... టోర్నీ ఆరో రౌండ్ ర్యాపిడ్ గేమ్‌లో 30 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. అర్జున్ విజయంతో ఎంజీడీ1 3.5-2.5తో డబ్ల్యూఆర్ చెస్‌ను ఓడించింది. ప్రస్తుతం 13 పాయింట్లతో ఎంజీడీ1 రెండో స్థానంలో, డ్రాగన్ చిల్లింగ్ (14) అగ్రస్థానంలో ఉన్నాయి.



# మరో నాలుగేళ్లు ఆడతాడు: విరాట్ రిటైర్‌మెంట్‌పై ఆర్సీబీ సీఈవో




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో విరాట్ కోహ్లీకి ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఒకేఒక్క ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఏకైక ప్లేయర్ విరాట్ కోహ్లీనే. రెండుసార్లు విజేతగా నిలవడంలో అతడిదే కీలక పాత్ర. ఇప్పటికే అంతర్జాతీయంగా టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ తర్వాత ఆ ఫార్మాట్‌కూ గుడ్‌బై చెప్పేస్తాడని వార్తలు వస్తున్నాయి. అలాగే వచ్చే ఐపీఎల్ సీజన్ అనంతరం మెగా లీగ్‌కు వీడ్కోలు పలుకుతాడని చర్చ మొదలైంది. అయితే, వీటిని ఆర్సీబీ సీఈవో రాజేశ్ మేనన్ కొట్టిపడేశారు.

"ఒకే నాణేనికి ఆర్సీబీ, విరాట్ రెండు ముఖాలు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. ఒకవేళ అతడు క్రికెట్‌కు దూరమైనా సరే.. ఆర్సీబీలో భాగం కాకుండా ఉండటాన్ని మేం ఊహించలేం. తప్పకుండా దీని గురించి ఆలోచన చేస్తాం. ఇప్పటికప్పుడు విరాట్ ఐపీఎల్‌ను వదిలిపెట్టడు. కనీసం మూడు లేదా నాలుగేళ్లు ఆడతాడు. అతడి ఫిట్‌నెస్ చాలా బాగుంది. ఇప్పటికీ పరుగుల దాహం తీరలేదు. ఇటీవల సీజన్‌లో కోహ్లీని చూస్తే ఇట్టే అర్థమైపోతుంది" అని రాజేశ్ స్పష్టం చేశారు.

**ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ కోసం..**

ఐపీఎల్ ముగిసిన తర్వాత భారత్ అఫ్గాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడింది. వన్డే సిరీస్ ఆడుతోంది. అయితే, గాయం కారణంగా విరాట్ అఫ్గాన్‌తో వన్డేలకు దూరంగా ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ నాటికి జట్టుతో పాటు చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. "విరాట్ రిహాబిలిటేషన్ మొదలైంది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రిపోర్ట్ చేయనున్నాడు. అక్కడ ఫిట్‌నెస్‌పై అంచనాకు వచ్చి.. క్లియరెన్స్ జారీ చేయనుంది. అనుకున్నవిధంగా సాగితే.. కోహ్లీ ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ నాటికి సిద్ధంగా ఉంటాడు" అని పేర్కొన్నాయి.

# ఆటతోనే తండ్రిని విడిపించాడు

ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కొలంబియా ఘనవిజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన లూయిస్ డియాజ్ పేరు కొన్నేళ్ల ముందు ప్రపంచ ఫుట్‌బాల్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే అందుకు అతడి ఆట కారణం కాదు. లూయిస్ తల్లిదండ్రులు మేన్ డియాజ్, సిలెనిస్ మరులాండాలను తీవ్రవాదులు కిడ్నాప్ చేయడం 2023లో సంచలనం రేపింది. కొలంబియా-వెనెజువెలా సరిహద్దుల్లో ఈ ఘటన జరిగింది. లూయిస్ తల్లి త్వరగానే బయటపడింది కానీ.. తండ్రి మాత్రం కిడ్నాపర్ల చెరలోనే ఉండిపోయాడు. అప్పుడు లివర్‌పూల్ క్లబ్‌కు ఆడుతున్న లూయిస్.. రెండు మ్యాచ్‌లకు దూరమై తండ్రిని విడిపించడానికి ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం లేకపోయింది. అయితే తర్వాత తండ్రిని కాపాడడానికి అతను ఆటనే ఆయుధంగా చేసుకున్నాడు. తన చొక్కా మీద 'తండ్రికి స్వేచ్ఛ దొరకాలి' అనే నినాదంతో మ్యాచ్‌లు ఆడగా.. అతడి తండ్రి కిడ్నాప్ అయిన విషయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో కొలంబియా ప్రభుత్వం జోక్యం చేసుకునిని 12 రోజుల తర్వాత కిడ్నాపర్ల చెర నుంచి లూయిస్ తండ్రిని విడిపించింది. ఇటీవల ప్రపంచకప్ నేపథ్యంలో మేన్ డియాజ్.. తన కొడుకు జెర్సీతో ప్రార్థన చేసిన వీడియో వైరల్ అయింది. కొలంబియా తొలి విజయంలో లూయిస్ కీలక పాత్ర పోషించడంతో ఇప్పుడు అతడి పేరు మార్మోగుతోంది.



# ప్రపంచ కప్ టోర్నీకి శ్రేయాంక దూరం

ఐసీసీ మహిళల ప్రపంచ కప్‌లో వరుసగా రెండు మ్యాచుల్లో విజయంతో జోష్ మీదున్న భారత్‌కు షాక్ తగిలింది. మంచి ఫామ్‌లో ఉన్న ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ టోర్నీకి దూరమైంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడింది. దీంతో మ్యాచ్ మధ్యలోనే ఆమె మైదానాన్ని వీడింది. చీలమండకు గాయం ఎక్కువవడంతో టోర్నీ నుంచే వైదొలిగినట్లు బీసీసీఐ పేర్కొంది.

**లెగ్ స్పిన్నర్‌కు చోటు..**

శ్రేయాంక పాటిల్ స్థానంలో మరొక స్పిన్నర్‌ను భారత్ తీసుకుంది. లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్‌కు స్క్వాడ్‌లో అవకాశం కల్పించింది. దీనికి వరల్డ్ కప్ టెక్నికల్ కమిటీ కూడా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రేమా రావత్ ఇంగ్లాండ్‌లోనే భారత్ A జట్టుతో పాటు ఉంది. దీంతో ఆమె నేరుగా సీనియర్ టీమ్‌తో కలవనుంది. "ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2026 ఈవెంట్ టెక్నికల్ కమిటీ ఆమోదం మేరకు శ్రేయాంకా పాటిల్ ప్లేస్‌ను ప్రేమా రావత్ భర్తీ చేయనుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్ సమయంలో శ్రేయాంక గాయపడింది. దీంతో ఆమె ఈ టోర్నీకి దూరమైంది" అని ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. లీగ్ స్టేజ్‌లో భారత్ ఇప్పటికే రెండు మ్యాచులు ఆడేసింది. పాక్, నెదర్లాండ్స్‌పై విజయంతో గ్రూప్ Aలో ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది.

అనంత జనశక్తి
సోమవారం | అనంతపురం
22.06.2026





# నన్నెందుకు 'సింగ గీతం'లో తీసుకోలేదు

"సింగ గీతం'లో నన్నెందుకు తీసుకోలేదు" అంటూ నాగ్ అశ్విన్‌ని ప్రశ్నించారు కథానాయకుడు ప్రభాస్. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ సినిమాని వైజయంతి మూవీస్ పతాకంపై నాగ్ అశ్విన్ నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని ప్రభాస్ ఇటీవల వీక్షించిన నేపథ్యంలో దర్శక నిర్మాత నాగ్ అశ్విన్‌తో సరదాగా ముచ్చటించారు. సినిమా చూసిన తర్వాత నాగీని 'కమ్ టు మై రూం" అంటూ ప్రభాస్ సీరియస్‌గా పిలవడం.. "నా వాయిస్‌లో ఏదైనా సమస్య ఉందా? నాకు పాటలు పాడటం రాదనుకున్నావా? నేను ప్రయోగాలు చేయలేదా? నన్నెందుకు 'సింగ గీతం'లో పెట్టుకోలేదు?" అంటూ సరదాగా ప్రశ్నించడం నవ్వులు పూయించింది. ప్రస్తుతం ఈ ఫన్నీ ప్రమోషనల్ వీడియో నెట్టింట సందడి చేస్తోంది.

# విజయ్ సేతుపతి కొత్త చిత్రం

కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు విలక్షణ నటుడు విజయ్ సేతుపతి. ఈ ఏడాది 'ట్రైన్', 'స్లమ్ డాగ్' లాంటి చిత్రాలతో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్న ఆయన.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'కాదలిక్క నేరమిల్లై'తో గతేడాది మంచి విజయాన్ని అందుకున్నారు దర్శకురాలు కృతిక ఉదయనిధి. ఇప్పుడామె తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రాన్ని రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోందట. వచ్చే వారం చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని, త్వరలో మరిన్ని వివరాల్ని వెల్లడించే అవకాశాలు ఉన్నాయని విజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.







# సమంత.. బంగారం లాంటి కబురు

కథానాయిక సమంతకు, ఆమె అభిమానులకూ ఇది వేడుక సమయం. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. చాలా రోజుల తర్వాత సమంత తెరపై కనిపించి వినోదం పంచడం ఆమె అభిమానుల్ని సంతోషపెట్టింది. ఈ సినిమా విజయోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న సమంత మరో తీపి కబురుని చెప్పకనే చెప్పారు. ఆమె త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వనున్నారు. సమంత ప్రస్తుతం గర్భంతో ఉన్నారు. భర్త రాజ్ నిడిమోరు, చిత్రబృందంతో కలిసి శనివారం 'మా ఇంటి బంగారం' విజయోత్సవాల్లో పాల్గొన్న సమంత గర్భంతో ఉన్నట్టుగా కనిపించారు. 2025లో వివాహ బంధంతో ఒక్కటయ్యారు సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు. రాజ్ అందించిన కథతోనే 'మా ఇంటి బంగారం' సినిమా తెరకెక్కింది.



# 27 ఏళ్లలో ఒక్క హిందీ ఆఫర్ కూడా రాలేదు

దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి జ్యోతిక తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో అగ్ర కథానాయికగా కొనసాగిన ఆమెకు 27 ఏళ్ల కెరీర్‌లో ఒక్క హిందీ సినిమా ఆఫర్ కూడా రాలేదని వెల్లడించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1998లో విడుదలైన 'దోలి సజా కె రఖ్నా' సినిమాతో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమైన జ్యోతిక, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అనంతరం ఆమె దక్షిణాది చిత్రసీమ వైపు అడుగులు వేసి, ముఖ్యంగా తమిళ సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. అనేక సూపర్ హిట్, బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.అయితే అంతటి స్టార్‌డమ్, విజయాలు సాధించినప్పటికీ బాలీవుడ్ నుంచి తనకు అవకాశాలు రాకపోవడం వెనుక ఉన్న కారణాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో జ్యోతిక వెల్లడించారు. గత 27 ఏళ్లలో ఒక్కసారి కూడా హిందీ సినిమా కోసం నన్ను ఎవరూ సంప్రదించలేదు. చాలా మంది నేను బాలీవుడ్‌లో నటించకూడదని నిర్ణయించుకున్నానని భావించి ఉండొచ్చు. కానీ నిజానికి నాకు ఒక్క స్క్రిప్ట్ కూడా రాలేదు అంటూ జ్యోతిక ఆశ్చర్యకర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల 'సైతాన్', 'డబ్బా కార్టెల్' వంటి హిందీ ప్రాజెక్ట్‌లతో బాలీవుడ్‌లో మళ్లీ కనిపిస్తున్న జ్యోతిక, తనకు అవకాశాలు రావడం వెనుక మరో ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. తాను ముంబైకి మకాం మార్చిన తర్వాతే హిందీ అవకాశాలు రావడం ప్రారంభమైందని చెప్పారు.




# మృణాల్ ప్రేమకథకు బ్రేక్ పడిందా

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ సాగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా ఉండడం వంటి అంశాలు ఈ రూమర్లకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ జంట విడిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గత ఏడాది ఆగస్టులో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్ షోలో ధనుష్, మృణాల్ కలిసి కనిపించడం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. అనంతరం ధనుష్ నటించిన 'తేరే ఇష్క్ మే' సినిమా పార్టీకి కూడా మృణాల్ హాజరుకావడం ఇద్దరి మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉందనే చర్చలకు దారి తీసింది. అంతేకాకుండా, మృణాల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ధనుష్ సోదరీమణులు డాక్టర్ కార్తీక, విమలా గీతలను ఫాలో అవ్వడం కూడా ఈ ప్రేమ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కూడా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ రూమర్లపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ నాకు మంచి స్నేహితుడు మాత్రమే అని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలు కూడా పుకార్లకు పూర్తిగా తెరదించలేకపోయాయి. ఇదిలా ఉంటే, ఈ ఇద్దరికీ సన్నిహితంగా ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం వారు నిజంగానే డేటింగ్ చేస్తున్నారని, కానీ ఆ సంబంధం ప్రారంభ దశలోనే ఉందని పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఇద్దరికీ ఒకే విధమైన ఆలోచనలు, విలువలు ఉండడంతో ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటున్నారని, అయితే తమ వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచాలని కోరుకుంటున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314